IN MEDIA PUBLICATION PVT LTD
MV NEWS మన మీ వార్త

@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512

# మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

హైదరాబాద్
శుక్రవారం 28 ఆగస్టు 2026
సంపుటి : 02
సంచిక :57
పేజీలు : 12 వెల : 5/-

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857


# గవర్నర్‌కు గుండె శస్త్రచికిత్స

## పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి



**గచ్చిబౌలి (హైదరాబాద్):**
రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా బుధవారం గుండె నొప్పితో హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండెలో బ్లాక్స్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి స్టెంట్ వేశారు. ప్రస్తుతం గవర్నర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ఆసుపత్రిలో గవర్నర్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీఎం వెంట ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.



## ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

- పుతిన్‌తో కీలక భేటీ
- భారత్, రష్యా సంబంధాలపై చర్చ
- నాలుగు రోజుల పాటు రెండు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ
- బీజింగ్‌లో 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు

## ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో

# పౌష్టికాహారం

- తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు గుడ్‌న్యూస్.
- ఆగస్టు 31 నుండి మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించే పథకాన్ని ప్రారంభించనుంది.
- హరేకృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 42 వేల మందికి పైగా విద్యార్థులకు ఈ సేవలు అందనున్నాయి.



**హైదరాబాద్**
ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేసింది. మంచిర్యాల జిల్లా పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూఫ్ టాప్ ఆటోమేటెడ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులు, హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో 42 వేల మంది విద్యార్థులకు ఒకే సమయంలో అల్పాహారం, 5 వేల మంది కళాశాల విద్యార్థులకు మద్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు అర్ధాకలితో ఉండకూడదన్న నిర్ణయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకం మంచిర్యాల జిల్లా లో ఆగస్టు 31వ తేదీన ప్రారంభం కానుంది. ఈ కిచెన్‌కు హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఆధునిక - మిగతా3లో



# మాకు ఏ భేషజాలు లేవు

## రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానినీ కలుస్తాం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్**
హైదరాబాద్--విజయవాడ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేల మంది ప్రాణాలను కోల్పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లు, జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి ఆరా తీశారు. హైదరాబాద్--విజయవాడ రహదారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్‌పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, హైమాస్క్ లైట్స్ పనుల - మిగతా3లో



## ధరల మంటలు..

# కుటుంబ బడ్జెట్ బేజారు



## భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

- 2036 ఒలింపిక్స్‌కు సిద్ధమవ్వాలి: మోదీ
- డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడల పాత్ర కీలకమని వ్యాఖ్య
- 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని పిలుపు

# నేపాల్ వరద విధ్వంసం

- 359కి చేరిన మృతుల సంఖ్య
- 288 మంది భారతీయులు గల్లంతు
- నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు తెలిపిన విదేశాంగ శాఖ
- టిబెట్‌లోని మరో 200 మంది భారతీయులు భారత్ సాయం కోరినట్లు వెల్లడి
- 359 మంది మృతి

**హైదరాబాద్**
నేపాల్‌లో ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య గంటగంటకూ పెరుగుతోంది. మృతుల సంఖ్య 359 దాటినట్లు నేపాల్ పోలీసులు ప్రకటించారు. 910 మంది ఆచూకీ గల్లంతైంది. గల్లంతైన వారిలో 288 మంది భారత పర్యటకులు ఉన్నారు. ఉప్పెనలా వరద, బురద ముంచెత్తడంతో వేలాది ఇళ్లు, పలు వంతెనలు నామరూపాల్లేకుండా పోయాయి. అనేక చోట్ల భారీ ఎత్తున బురద మేట వేసింది. సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో - మిగతా3లో



- పేద, మధ్య తరగతి కుటుంబాల బెంబేలు.. కుటుంబ బడ్జెట్ బేజారు
- 6.32 శాతం ద్రవ్యోల్బణంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం
- దేశ సగటు ద్రవ్యోల్బణం 4.45 శాతం.. పెరిగిన ఉల్లి, కూరగాయలు, పప్పుల ధరలు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే ముప్పు.. ధరల కట్టడికి సర్కారు చర్యలే కీలకం

**హైదరాబాద్**
నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కూరగాయలు, ఉల్లిగడ్డ, పప్పులు, ఇతరత్రా కిరాణా వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో మధ్యతరగతిపై భారం పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ధరల పెరుగుదల కొనసాగుతున్నప్పటికీ... రాష్ట్రంలో అది మరికొంత అధికంగా ఉండటం ఆందోళనను కలిగిస్తోంది. ప్రధాన రాష్ట్రాల్లో దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రిటైల్ ద్రవ్యో ల్బణం 6.32% నమోదవడం కలవరం రేపుతోంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల్లో ఈ పరిస్థితి వెల్లడైంది. తెలంగాణ తరువాత ఏపీలో ద్రవ్యోల్బణం 5.72% ఉండగా, తమిళనాడులో 5.44%, మధ్యప్రదేశ్‌లో 4.91%, కర్ణాటకలో 4.89%గా ఉంది. దేశం సగటు ద్రవ్యోల్బణం 4.45%గా నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణలోనే కూరగాయలతోపాటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జూలైలో దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 4.45%గా ఉండగా, ఆహార - మిగతా3లో

# హీటెక్కిస్తున్న కాంగ్రెస్ రాజకీయం



- చివరి నిమిషంలో ట్విస్ట్ ఉంటుందా?
- కొండా సురేఖ ఎపిసోడ్‌లో హైటెన్షన్
- ఖర్గేతో భట్టి భేటీ.. ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలపై ఆరా
- ఢిల్లీకి త్వరలో సీఎం, పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం?

# ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిష్కెక్ నగరంలో ఎస్‌సీవో సదస్సుకు మోదీ హాజరవుతారు. చివరి రోజు ఆయన ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్' ప్రారంభోత్సవ వేడుకల్లోనూ ఇతర ఎస్‌సీవో దేశాల నేతలతో కలిసి మోదీ పాల్గొంటారు. కిర్గిజ్‌స్థాన్ పర్యటనకు ముందు 29, 30 తేదీల్లో మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. పుతిన్?తో జరిగే భేటీలో భారత్?- రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు సమీక్ష నిర్వహించినున్నట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. అలాగే ఇతర దేశాల నేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆయా నేతల సమయానుకూలత, అందుబాటును బట్టి సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.



**ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు మోదీ**

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళ్లనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి వెళ్లడం. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించనున్నారు. భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు నేతలు చర్చించనున్నారు.


**దాదాపు 100 కోట్ల డాలర్ల వాణిజ్యం, పెట్టుబడులు**

భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ఆర్థిక సంబంధాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాలు సహకరిస్తున్నాయి. ఉజ్బెకిస్థాన్‌లో ప్రస్తుతం 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు కూడా ఉన్నాయి. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు ఉన్నాయి.

**'వికసిత్ భారత్-2047'పై చర్చ**

మోదీ, మిర్జియోయెవ్ సమావేశంలో భారత్ ప్రతిపాదిస్తున్న 'వికసిత్ భారత్-2047', ఉజ్బెకిస్థాన్ అభివృద్ధి లక్ష్యం 'ఉజ్బెకిస్థాన్-2030' మధ్య సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగం, విద్య, అంతరిక్షం, సాంకేతికత, సంస్కృతి, వ్యాపార సంబంధాలు వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసే విందులోనూ ప్రధాని పాల్గొంటారు. ఎస్‌సీఓలో ప్రస్తుతం 10 సభ్య దేశాలు ఉన్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కాలక్రమేణా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీ, సాంకేతికత తదితర రంగాలకు కూడా సహకారం విస్తరించింది.

# భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా



యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడలు ఒక అద్భుతమైన ఆయుధంగా పనిచేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. క్రీడలు జీవితాలను ఎలా మార్చగలవో చెప్పడానికి మన పారా అథ్లెట్లు ఒక ఉదాహరణ అని, వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని అన్నారు. క్రీడల పట్ల తన దృక్పథం కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదని, దేశ నిర్మాణ ప్రక్రియలో వాటిని ఒక అంతర్భాగంగా మార్చడమేనని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్?లో మోదీ వర్చువల్?గా పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

"ఒలింపిక్స్‌లో అనేక రకాల క్రీడలు ఉంటాయి. కానీ భారతీయ జట్లు వాటిలో కనీసం సగం విభాగాల్లో కూడా పాల్గొనడంలేదు. ఇదొక చేదు నిజం. ఎందుకంటే, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 32 క్రీడా విభాగాలలో భారత్ కేవలం 16 విభాగాల్లో మాత్రమే పాల్గొంది. మొత్తం పతకాల సంఖ్యలో గణనీయమైన భాగానికి మనం పోటీనే పడటం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలు క్రీడల్లో పతకాలు సాధిస్తుంటే, మనం కనీసం వాటిలో పాల్గొనడం కూడా లేదు. పతకాల సంఖ్యను పెంచుకోవాలంటే సంబంధిత క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఇటీవల నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్?కు పతకాలు తెచ్చిపెట్టే బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్ వంటివి లేకపోవడం ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపించింది. మొత్తం 10 క్రీడలకు గాను ఆరు పారా-క్రీడా ఈవెంట్లలో మాత్రమే భారత్ పాల్గొంది. అయినప్పటికీ, 13 స్వర్ణాలు, 17 రజతాలు, తొమ్మిది కాంస్య పతకాలతో పాయింట్ల పట్టికలో భారత్? నాలుగో స్థానంలో నిలిచింది."

**'యువ ప్రతిభను గుర్తించాలి'**


ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని, అయితే, మైదానంలోకి అడుగుపెట్టకుండా ఆ స్ఫూర్తిని అలవర్చుకోవడం చాలా కష్టమని మోదీ అన్నారు. విజేతలుగా ఎలా నిలవాలో నేర్పడమే కాకుండా, మంచి పోటీదారులుగా ఎలా ఎదగాలో క్రీడల నుంచి నేర్చుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని మోదీ పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన ఒలింపిక్స్ పోటీల్లో భారత్? నుంచి చాలా తక్కువ జట్లు పాల్గొన్నారని చెప్పారు. "2036 ఒలింపిక్స్ భారతదేశంలోనే జరగాలని మేం నిర్ణయించుకున్నాం. ఈ నేపథ్యంలో వివిధ క్రీడాంశాలపై భారత్? దృష్టి సారించాల్సిన అవకాశం ఉంది. 2036 ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా, ముఖ్యంగా ప్రస్తుతం ఐదు, 10 లేదా 15 ఏళ్ల వయస్సు ఉన్న యువ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రతి గ్రామం, నగరం, పాఠశాలలో ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం" అని మోదీ తెలిపారు.

**'వారికి ప్రభుత్వ మద్దతు ఉంటుంది'**

అయితే, క్రీడల్లో పాల్గొనేందుకు అభ్యర్థులకు అవసరమైన మద్దతును ప్రభుత్వం తప్పక అందిస్తుందని మోదీ హామీ ఇచ్చారు. 21వ శతాబ్దపు ఆధునిక క్రీడా వ్యవస్థను (ఎకోసిస్టమ్) రూపొందించడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆ దిశగా క్రీడా విశ్వవిద్యాలయాల నుంచి ఆధునిక శిక్షణా కేంద్రాల వరకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 80 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రసంగంలో భారతదేశ క్రీడా భవిష్యత్తుపై తన దార్శనికతను వివరించారు. దేశ క్రీడా బలాన్ని యువ శక్తితో మేళవించి, దానిని దేశ నిర్మాణానికి మళ్లించడమే ప్రధాన లక్ష్యమని మోదీ పేర్కొన్నారు.

# 400 మందితో భారత్‌కు జిన్‌పింగ్

**న్యూఢిల్లీ :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 400 మంది అధికారుల భారీ ప్రతినిధి బృందంతో ఆయన రానున్నట్లు సమాచారం. 2020 నాటి సరిహద్దు వివాదాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. ఇది ఓ కీలక పరిణామంగా మారనుంది. అదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సరిహద్దు చర్చల నిమిత్తం బీజింగ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.బ్రిక్స్ సదస్సు కోసం షీ జిన్‌పింగ్ వెంట దాదాపు 400 మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నట్లు సమాచారం. 2019 నాటి పర్యటనతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం చైనా అధికారులు ఢిల్లీలో హోటళ్ల కేటాయింపులు, భద్రతా ప్రోటోకాల్‌లను ఆఖరి దశలో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సదస్సు కేవలం బ్రిక్స్ ఎజెండా కోసమే కాకుండా భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ సంకేతంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు షీ జిన్‌పింగ్ రాకపై సన్నాహాలు జరుగుతుండగానే.. మరోవైపు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లిన డోభాల్.. మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొని సుదీర్ఘ సరిహద్దు వివాదాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ ఈ తో కూడా ఆయన ద్వైపాక్షిక సమావేశం కానున్నారుభారత్-చైనా మధ్య హిమాలయ ప్రాంతంలో 3,800 కిలో మీటర్ల మేర సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత నాలుగేళ్ల మిలిటరీ సైనిక చర్చల ఫలితంగా 2024 అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరింది. అయితే జూలై చివర్లో సరిహద్దు వద్ద మళ్లీ సైనికులు ఎదురెదురుపడటంతో.. సరిహద్దుల్లో పూర్తి శాంతి పునరుద్ధరణే దౌత్య సంబంధాలకు ప్రాతిపదిక అని భారత్ ఇటీవల స్పష్టం చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన వాణిజ్య విధానాల నేపథ్యంలో.. భారత్, చైనా రెండూ బ్రిక్స్ వేదికగా పరస్పర సహకారాన్ని పెంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. షీ జిన్‌పింగ్ చివరి పర్యటన నిర్ణయం ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ.. బీజింగ్ మాత్రం భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.



## 'ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యనే మరో 25 ఏళ్లు పాటు కొనసాగించాలి' -డీలిమిటేషన్‌పై మోదీకి ఖర్గే లేఖ



దేశ రాజకీయాల్లో కీలకమైన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలతో పంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ప్రస్తుత లోక్?సభలోని సభ్యుల సంఖ్యను 25 ఏళ్ల పాటు యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలి. అంతేకాకుండా రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యలోనూ మరో 25 ఏళ్లపాటు మార్పులు చేయకూడదు. దీంతో పాటు 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ అమలు చేయాలి. డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ అంశం కూడా దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యమున్న అంశం. ప్రభుత్వం వద్ద ఉన్న డీలిమిటేషన్ ప్రతిపాదనలను అన్ని పార్టీలతో చర్చించాలి. వాటిని అధ్యయనం చేసేందుకు రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలి' అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. జులై 16న కూడా ఇదే అంశంపై ప్రధానికి లేఖ రాసినట్లు ఖర్గే గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని అప్పుడే కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి టీవీ ఇంటర్వ్యూలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని చెప్పడంతో మరోసారి ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి కీలకమైన అంశంపై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా విస్తృతంగా చర్చించాలని ఖర్గే కోరారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని అన్నారు. ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసినట్లుగా మరోసారి ఈ ప్రక్రియను బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించవద్దని ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు.

**మహిళా రిజర్వేషన్‌పైనా కాంగ్రెస్ పట్టుబట్టు**

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్? కల్పించాలన్న అంశాన్ని కాంగ్రెస్? గతంలోనూ ప్రస్తావించింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను పునరుద్ఘాటించాయి. డీలిమిటేషన్?కు సంబంధించిన అంశాలతో ముడిపెట్టి మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్న ప్రధాని విజ్ఞప్తిని కాంగ్రెస్ గతంలో విమర్శించింది. మహిళ రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించింది.

**ఏప్రిల్‌లో బిల్లుకు ఎదురుదెబ్బ**

2026 బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. వారిలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలోని ఓట్లలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం. అంటే 352 ఓట్లు రావాల్సి ఉండగా, అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక పార్లమెంట్ వర్షాకాల? సమావేశాలు నిరవధిక వాయిదా రెండు వారాలపైగా అవుతున్న ఇంతవరకు ప్రొరోగ్?పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి ప్రతిపాదన తీసుకొస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 'ఆపరేషన్ సిందూర్‌లో చైనా పాత్రపై గందరగోళం' - మాజీ జనూ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు

ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా- పాకిస్థాన్ మధ్య సైనిక సహకారంపై మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు వర్షం కురిపించింది. గతంలో డిప్యూటీ చీఫ్? ఆఫ్? ఆర్మీ స్టాఫ్? లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు, తాజాగా అనిల్ చౌహాన్ చెప్పిన అంశాలకు పొంతన లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గతేడాది రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు, తాజాగా అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను జైరాం రమేశ్ ఎక్స్?లో షేర్ చేశారు. చైనా- పాక్ సైనిక సహకారంపై భిన్నమైన వాదనలు ఎందుకు వినిపిస్తున్నాయని ప్రశ్నించారు. 2025 జులై 4న లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా-పాకిస్థాన్ మధ్య ఉన్న సహకారం గురించి తీవ్రంగా ప్రస్తావించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అయితే 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఏం జరుగుతోంది కథనాన్ని మార్చేందుకు ఏదైనా లోతైనా ప్రణాళిక ఉందా దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. చైనాతో సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కూడా ఆయన విమర్శలు చేశారు. చైనా విషయంలో మోదీ ప్రభుత్వం రాజీ ధోరణిని అనుసరిస్తోందా? అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

**'చైనా పాక్‌కు అన్ని విధాలా సహకరించింది'**

2025లో లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. మే 7 నుంచి 10 వరకు భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణను చైనా ఆయుధ వ్యవస్థలను పరీక్షించుకునే 'లైవ్ ల్యాబ్'గా ఉపయోగించుకుందని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలా మద్దతు అందించిందని, తుర్కియే కూడా ఆయుధ సామగ్రిని సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. పాక్ ముందుండి పోరాడుతున్నప్పటికీ, చైనా, తుర్కియే మద్దతుతో భారత్ ఒకేసారి కనీసం ముగ్గురు ప్రత్యర్థులను ఎదుర్కొందని తెలిపారు. పాకిస్థాన్ సైన్యానికి చైనా ఉపగ్రహాల ద్వారా భారత సైనిక మోహరింపులపై సమాచారం అందిందని కూడా రాహుల్ సింగ్ అప్పట్లో పేర్కొన్నట్లు గుర్తు చేశారు.

అయితే తాజాగా అనిల్ చౌహాన్ దీనిపై భిన్నమైన వివరణ ఇచ్చారు. పాకిస్థాన్ వద్ద ఉన్న సైనిక ప్లాట్?ఫామ్?ల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనా తయారీకి చెందినవేనని తెలిపారు. విదేశీ ఆయుధ వ్యవస్థలను ఒక దేశం కొనుగోలు చేసినప్పుడు వాటి నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవల కోసం ఆయా తయారీ సంస్థల ప్రతినిధులు అక్కడ ఉండటం సాధారణమేనని వివరించారు. యుద్ధ సమయంలో ఆయుధ వ్యవస్థలు పనిచేసేలా చూసే బాధ్యత ఆయా సంస్థలపై ఉంటుందని చెప్పారు. పాకిస్థాన్‌లో చైనా ఆయుధ తయారీ సంస్థల ప్రతినిధులు ఉండటం విషయాన్ని చైనా కూడా అంగీకరించిందని, ఇందులో కొత్త విషయం ఏమీ లేదని చౌహాన్ అన్నారు. ఇదే విధంగా భారత్‌లోనూ రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్‌కు చెందిన ఆయుధ సంస్థల ప్రతినిధులు తమ పరికరాల నిర్వహణ కోసం ఉండే అవకాశం ఉందని వివరించారు.

# ధరల మంటలు.. కుటుంబ బడ్జెట్ బేజారు

-మొదటిపేజీ తరువాయి

వస్తువుల ధరలను ప్రతిబింబించే ఆహార ద్రవ్యోల్బణం 5.52%గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం మరింత ఎక్కువగా 5.79 శాతంగా నమోదైంది. దీనికి భిన్నంగా తెలంగాణలో మొత్తం ద్రవ్యోల్బణం 6.32%గా ఉండటం రాష్ట్ర ప్రజలపై ధరల భారం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తోంది. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలో ధరల పెరుగుదల అధికంగా ఉంది. ప్రతి కుటుంబం నెలవారీ వంటింటి ఖర్చులో కనిపిస్తున్న అదనపు భారానికి ఇది అద్దం పడుతోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్లలో ఉల్లిగడ్డ కిలో రూ.50--55 పలుకుతోంది. బోయిన్‌పల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో అదే ఉల్లి రూ.30--35 మధ్య లభిస్తుండగా, రైతుబజార్లలో రూ.40--44 విక్రయిస్తున్నారు. అదే రిటైల్ మార్కెట్‌కు చేరే కొద్దీ ధర గణనీయంగా పెరుగుతోంది. అలాగే, క్యారట్, చిక్కుడు, బీన్స్, వంకాయలు తదితరాల ధరలు కూడా భారీగా పెరగడంతో కుటుంబాల నెలవారీ కూరగాయల ఖర్చు భారీగా పెరిగింది. పప్పుల ధరలు సైతం సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. బియ్యం ధరలు సైతం బెంబేలెత్తిస్తున్నాయి. మూడు నెలల క్రితం సన్న బియ్యం ధర కిలో రూ.48--55 ఉండగా, ఇప్పుడు 65--70 వరకు ఉన్నాయి.



### రాష్ట్రంలో ప్రభుత్వ జోక్యం అవసరం

రాష్ట్రంలో హాకా, రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరలకు ఉల్లి, ఇతర నిత్యావసరాలను అందుబాటులోకి తేవాలనే డిమాండ్ పెరుగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగాయని చెబుతున్న అధికారులు రేట్ల తగ్గింపునకు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి సూచనలు చేయకపోవడం గమనార్హం. పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలపై మరింత ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌లోకి ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను పెంచడం, రైతుబజార్లలో నిల్వలు పెంచడం, హోల్‌సేల్--చిల్లర ధరల వ్యత్యాసాన్ని పర్యవేక్షించడం, అక్రమ నిల్వలు--కృత్రిమ కొరతపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

### ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు

మునుపటి పంట నిల్వలు తగ్గిపోవడం, కొత్త పంట మార్కెట్‌కు రావడానికి ఇంకా సమయం ఉండటం. ఉత్పత్తి తగ్గిన సమయంలో డిమాండ్ పెరగడంతో ధరలపై ఒత్తిడి పెరిగింది.

పలు ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, పొలాల నుంచి మార్కెట్లకు సరుకు రవాణాలో ఆలస్యం ఏర్పడటం. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో వర్షాలు పంటల కోత, రవాణాపై ప్రభావం చూపుతున్నాయి.

శ్రావణ మాసం, రాబోయే వినాయక చవితి వేళ స్వీట్లు, పిండివంటల తయారీ పరిశ్రమలు, హోటళ్లు, గృహాల నుంచి వినియోగం ఒక్కసారిగా పెరగడం.

అంతర్రాష్ట్ర రవాణా వ్యయం పెరగడం వల్ల మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన మార్కెట్ల నుంచి వచ్చే సరుకుపై అదనపు భారంపడింది.

భారత్ దిగుమతి చేసుకునే ముడి పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెలపై అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరగడం, దిగుమతి సుంకాల్లో మార్పులు.

### ఇంటి ఖర్చులకే సరిపోక..

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో రవికిరణ్ అనే ప్రైవేటు ఉద్యోగి భార్య, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. నెలసరి వేతనం రూ.50 వేలు. గతంలో ఇంటి అద్దె, టూవీలర్ ఖర్చు, కిరాణా, కూరగాయలు, పాలు, పిల్లల చదువు, విద్యుత్, రవాణా, ఇతర ఖర్చులకు కలిపి సుమారు రూ.45 వేలు ఖర్చయ్యేవి. నెలకు రూ.5 వేలు పొదుపు చేసుకునేవారు. ఇప్పుడు కూరగాయలు, ఉల్లి, పప్పులు, నూనె, పాల ధరలు పెరగడంతో నెల ఖర్చు రూ.50 వేలకుపైగా అవుతోంది. ముఖ్యంగా కూరగాయలు, కిరాణాపై నెలకు రూ.3వేల వరకు అదనంగా ఖర్చవుతోంది. దీంతో గతంలో పొదుపు చేసిన రూ.5 వేలు ఇప్పుడు ఇంటి ఖర్చులకే సరిపోని పరిస్థితి. పిల్లల వినోదం, కొత్త దుస్తులు, బయట భోజనాలు తగ్గించడంతోపాటు పొదుపును కూడా వదులుకోవాల్సి వస్తోంది.

# నేపాల్ వరద విధ్వంసం

-మొదటిపేజీ తరువాయి

సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. నేపాల్‌లో సంభవించిన భయానక వరదల ప్రభావం తీవ్రంగా కొనసాగుతోంది. ఈ విపత్తులో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) గురువారం వెల్లడించింది. వీరిలో జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు పర్యాటక బృందాలకు చెందిన వారు కూడా ఉన్నారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. '288 మంది భారతీయులతో ప్రస్తుతం సంబంధాలు లేవు. వీరిలో కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లినవారితో పాటు పలు ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు ఉన్నారు. 73 మంది భారతీయులు త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టులో చేస్తున్నారు. తమిళనాడుకు చెందిన 37, 49 మందితో కూడిన రెండు బృందాలు, బంగాల్? చెందిన 32 మంది, కేరళకు చెందిన 33 మంది సహా పలువురి ఆచూకీ లేదు. వీరి ప్రస్తుత పరిస్థితిపై మరింత సమాచారం తెలుసుకునేందుకు కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయం ప్రాజెక్టు అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. అలాగే టిబెట్‌లోని 200 మంది భారతీయులు సాయం కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. కష్టకాలంలో భారత్ నేపాల్‌కు అండగా నిలుస్తోంది' అని జైస్వాల్ తెలిపారు . అయితే ఆ తర్వాత తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించారు. వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.



### హెల్ప్‌లైన్ నంబర్లు

భారతీయుల సమాచారం కోసం నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాఠ్?మండూ రాయబార కార్యాలయానికి o977 985 131 6807, o977 970 910 7500, o977 981 032 6117 నంబర్లలో వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించవచ్చు. భారత్‌లో ఏర్పాటు చేసిన 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను o91 11 2308 8718, o91 11 2308 8719 నంబర్లలో సంప్రదించవచ్చు. వాట్సాప్ కాల్స్, సందేశాల కోసం o91 9968291988 నంబర్‌ను వినియోగించవచ్చు.

### విదేశీయుల ఆచూకీపై ఆందోళన

ఈ విపత్తులో భారతీయులతో పాటు పలువురు విదేశీయుల ఆచూకీ కూడా తెలియడం లేదు. ఆస్ట్రేలియాకు చెందిన కనీసం 34 మంది యాత్రికులు, ట్రెక్కర్లు గల్లంతైనట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ తెలిపారు. కాఠ్?మండూలో ఉన్న 55 మంది మలేషియా పౌరులతోనూ సంబంధాలు తెగిపోయినట్లు ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. న్యూజిలాండ్‌కు చెందిన ఐదుగురు కూడా ప్రభావిత ప్రాంతంలో ఉన్నట్లు భావిస్తున్నామని, వారి పరిస్థితిపై స్పష్టత లేదని ఆ దేశ అధికారులు తెలిపారు.

వరదల ధాటికి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, 40 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. 9 జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఫలితంగా అనేక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజధాని కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే నాగ్‌దుంగా-ముగ్లింగ్ జాతీయ రహదారి సహా 9 జిల్లాల్లోని కీలక రోడ్లపై రాకపోకలను నిలిపివేశారు.

# తుమ్మిడిహెట్టి ఆనకట్ట అంశం సెప్టెంబర్ 1న సమావేశం ఏర్పాటు చేసిన కేంద్రం

ప్రాణహిత నదిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన తుమ్మిడిహెట్టి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై వచ్చే నెల ఒకటో తేదీన దిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదల, మహారాష్ట్ర జల వనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. తుమ్మిడిహెట్టి ఆనకట్టపై 2 రాష్ట్రాలతో సంప్రదింపులు : తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 26వ తేదీన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్?కు లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి కూడా ఈ అంశాన్ని సీఎం తీసుకెళ్లారు. ఆ లేఖను ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు కూడా ఆగస్టు ఐదో తేదీన లేఖ రాసిన ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. తుమ్మిడిహెట్టి ఆనకట్టపై రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర జలసంఘం ఛైర్మన్?కు కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. అందుకు అనుగుణంగా సెప్టెంబర్ ఒకటో తేదీన దిల్లీ సేవా భవన్?లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.



వివిధ అంశాలపై చర్చ

148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి మహారాష్ట్రతో గతంలో ఒప్పందం కుదిరింది. అయితే 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు రాష్ట్రం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలని భావిస్తున్నట్లు పేర్కొంది. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం నీటి లభ్యత పెరగడంతో పాటు అదనంగా అయ్యే ముంపు కూడా పరిమితంగానే ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న సమావేశంలో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర, ముంపు సంబంధిత అంశాలపై చర్చ జరగనుంది.

## హీటెక్కిస్తున్న కాంగ్రెస్ రాజకీయం

**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. క్రమశిక్షణ కమిటీ నివేదికతో వేటుకు రంగం సిద్ధమైందన్న ప్రచారం ఊపందుకున్న వేళ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భేటీ రాజకీయ ఉత్కంఠను మరింత పెంచింది. సురేఖపై చర్య ఖరారైందా? లేక అధిష్టానం చివరి నిమిషంలో మరో మార్గాన్ని ఎంచుకుంటుందా? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సురేఖపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయడం తెలిసిందే. ఈ నివేదిక ఏఐసీసీకి చేరడంతో బంతి పూర్తిగా అధిష్టానం కోర్టులోకి వెళ్లింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ కూడా ఈ వ్యవహారం ఏఐసీసీ పరిధిలో ఉందని, ఎలాంటి నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తామని తాజాగా ప్రకటించారు. ఇదే సమయంలో ఖర్గేతో భట్టి బెంగళూరులో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సురేఖ వ్యవహారంపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా భట్టి ఖర్గేకు వివరించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే చిన్నారెడ్డి వ్యవహారంపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణ కమిటీ సిఫారసు బయటకు వచ్చిన తర్వాత సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించడం దాదాపు ఖాయమన్న వాదన బలపడింది. కేబినెట్ నుంచి తక్షణమే తొలగించాలా? లేక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వరకు ఆగాలా? అన్న అంశంపై అధిష్టానం ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

### ఢిల్లీకి ముగ్గురు కీలక నేతలు

మంత్రి కొండా సురేఖతోపాటు చిన్నారెడ్డి తదితర నేతలకు సంబంధించి క్రమశిక్షణ సంఘం ఇచ్చిన నివేదికను ఏఐసీసీకి పంపిన నేపథ్యంలో ఇప్పుడు అందరి చూపు ఢిల్లీ వైపే ఉంది. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి త్వరలో ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ ఈనెల 31న ఢిల్లీకి వచ్చిన తరువాతే ఈ అంశంపై స్పష్టత వస్తుందన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ ముగ్గురు అధిష్టానంతో భేటీ అయితే సురేఖపై చర్యతోపాటు తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవలి కాలంలో పెరిగిన అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయం వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. సురేఖ, చిన్నారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితర ఎమ్మెల్యేల వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### మురళీ భేటీలో ఏం జరిగింది?

కొండా మురళీ డిప్యూటీ సీఎం భట్టిని కలిసి తన కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యం గురించి వివరించినట్లు చెబుతున్నారు. సురేఖ కుటుంబం తరఫున వివరణ ఇవ్వడంతోపాటు రాజకీయంగా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్న చర్చకు ఈ భేటీ కారణమైంది. అదే సమయంలో సురేఖ మంత్రి హోదాలో తనదైన శైలిలో వరంగల్ జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటుండడం, వివాదాస్పద వ్యాఖ్యల జోలికి వెళ్లకపోవడం గమనార్హం.

## ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో పౌష్టికాహారం..

-మొదటిపేజీ తరువాయి

సదుపాయాలతో నిర్మించిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించనున్నారు. ఈ కిచెన్ ద్వారా 18 మండలాల్లోని 691 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 42,450 మంది విద్యార్థులకు, అలాగే 13 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 6,654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ అందించనున్నారు. విద్యార్థులు ఉదయం పూట అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా విద్యను అభ్యసించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుందని చెపుతున్నారు నిర్వహకులు. ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా గంటకు 8 వేల ఇడ్లీలు, 3 వేల దోశలు, 5 వేలకు పైగా పూరీలు తయారు చేసే సామర్థ్యంతో ఈ కిచెన్ ఏర్పాటు చేశామని హరేకృష్ణ మూమెంట్ నిర్వహకులు చెపుతున్నారు. రెండు గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా సాంబారు, కూరలను తయారు చేస్తామని తెలిపారు. పక్కా శాఖాహారంతో భోజనాన్ని అందిస్తామని.. 15 నిమిషాల్లోనే వెయ్యి మందికి సరిపడా అన్నం సిద్ధం చేసే పరికరాల అందుబాటులో ఉన్నాయని కిచెన్ ఏజీవిం సందీప్ సింగ్ తెలిపారు. వెజిటబుల్ వాషింగ్, కటింగ్ యూనిట్లతో పాటు మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్వో వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, వ్యర్థ నీటి శుద్ధి ప్లాంట్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు సెంట్రలైజ్డ్ కిచెన్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదుతున్న విద్యార్థులు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే నిర్ణయంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకునాణ్యమైన విద్యతో పాటు పోషక ఆహారాలతో కూడిన అల్పాహారం, భోజనం అందించడం మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆగష్టు 31 నుండి మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఈ అల్పాహార పథకాన్ని అమలు చేయబోతున్నట్టు ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు తెలిపారు.

## మాకు ఏ భేషజాలు లేవు

-మొదటిపేజీ తరువాయి

పురోగతిని తెలుసుకున్నారు. చిట్యాల ఫ్లైఓవర్ ఈ దసరా నాటికి పూర్తిచేయాలని, మిగుతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. 6o2 రహదారి విస్తరణ కోసం ఇప్పటికే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే తమ ధ్యేయమని, అందుకోసం తమకు ఎలాంటి భేషజాలు లేవు అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి నితిన్ గడ్కరీని.. అవసరమైతే ప్రధానమంత్రిని కలుస్తామన్నారు.

## వైరల్ జ్వరాలు, ఫ్లూపై అప్రమత్తత అవసరం

హైదరాబాద్‌లో కొనసాగుతున్న వర్షాలు, అధిక తేమ కారణంగా వైరల్ జ్వరాలు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు ఇతర తీవ్రమైన జ్వరాలతో కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్, కింగ్ కోఠి ఆసుపత్రుల్లోని ఓపీ విభాగాలకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో జ్వరం వచ్చిన వెంటనే సొంతంగా మందులు వాడకుండా, 72 గంటలకు మించి జ్వరం కొనసాగితే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని కామినేని హాస్పిటల్స్ సీనియర్ వైద్యులు సూచించారు.

### 11 శాతం పెరుగుదల

స్థానికంగా డెంగీ పరిస్థితి గత రెండేళ్లతో పోలిస్తే మెరుగ్గా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. 2026 జనవరి నుంచి జులై మధ్య వరకు హైదరాబాద్?లో 266 డెంగీ కేసులు నమోదు కాగా, వాటిలో 127 లాబొరేటరీ ద్వారా నిర్ధారణ అయ్యాయి. ఇదే సమయంలో 2025లో 570, 2024లో 821 కేసులు నమోదయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 33,000కు పైగా డెంగీ కేసులు, 9,000కు పైగా హెచ్1ఎన్1 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది జులైతో పోలిస్తే ఇన్?ఫ్లుయెంజా కేసుల్లో 11 శాతం పెరుగుదల నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

### సొంత వైద్యం చేయకూడదు

కామినేని హాస్పిటల్స్, జనరల్ మెడిసిన్ విభాగం హెచ్?వోడీ, సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డా.ఎం.స్వామి మాట్లాడుతూ, "హైదరాబాద్?లో డెంగీ కేసులు గత రెండేళ్లతో పోలిస్తే తగ్గడం సానుకూల పరిణామం. అయితే ప్రస్తుతం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. సీజనల్ వైరల్ జ్వరాలు, హెచ్1ఎన్1 ఫ్లూ, డెంగీ ప్రారంభ దశలో మొదటి 48 గంటల్లో దాదాపు ఒకే విధమైన లక్షణాలు కనిపించవచ్చు. డెంగీ తరహా లక్షణాలతో వచ్చే అనేక మంది రోగుల్లో పరీక్షలు నెగిటివ్?గా వస్తుండగా, వారు తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న సందర్భాలు ఉన్నాయి. జ్వరం 3 రోజులకు మించి కొనసాగితే దానంతట అదే తగ్గిపోతుందని భావించకుండా, అదే రోజు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఓవర్-ది-కౌంటర్ మందులతో సొంత వైద్యం చేయకూడదు" అని సూచించారు. సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డా.హరి కిషన్ మాట్లాడుతూ వైరల్ జ్వరాలకు సొంతంగా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, పైగా యాంటీబయాటిక్స్?కు నిరోధకత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.

# సంపాదకీయం

## దారి తప్పుతున్న టీనేజ్...

పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు "పిల్లలు చెడిపోతున్నారు" అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లా డటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ మీడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, మీడియా, సినిమా, సోషల్ మీడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం. కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యా యుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. 'కొందరు చేస్తారు – మేము మాత్రం చూస్తాం' అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంట ర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.

# రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం ఎలా?

భారతదేశం హైవేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, మెట్రో రైళ్ళు, గూడ్సు రైళ్ళు, హైస్పీడ్ రైళ్ళ వంటి రవాణా వ్యవస్థల నిర్మాణంలో ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అయినప్పటికీ పౌరుల రోజువారీ ప్రయాణాలు సవ్యంగా సాగటం లేదు. భిన్న రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం లేకపోవటంతో అవి వేటికవిగా పనిచేస్తున్నాయి. విమానాశ్రయంలో దిగిన ప్రయాణికుడు అక్కడి నుంచి మెట్రో సర్వీసులకు కనెక్ట్ కావడంలో ఇబ్బందిపడుతున్నాడు. మెట్రో రైలు ప్రయాణికుడు బస్ కనెక్టివిటీ విషయంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇప్పుడు భారతదేశం ముందున్న సవాలు కొత్త రవాణా వ్యవస్థలను సృష్టించడం కాదు, ఉన్న వాటిని ఏకీకరించడం. జాతీయ అభివృద్ధి తదుపరి దశలో వేర్వేరు రకాల రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం కీలకమైన అంశం. దీనికి కోఆర్డినేటెడ్ ప్లానింగ్, యూనిఫైడ్ టికెటింగ్, సమాంతర షెడ్యూళ్లు, ఇంటెలిజెంట్ లాస్ట్--మైల్ కనెక్టివిటీలు కావాలి. జాతీయ ఆర్థిక ఉత్పత్తిలో సుమారు మూడింట ఒక వంతు మన నగరాల నుంచే వస్తున్నది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, కలకత్తా, పూణే వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలు దేశ ఆర్థిక వృద్ధికి ఇంజన్లుగా ఉన్నాయి. అయితే రద్దీ, ప్రయాణ ఆలస్యాలు, ఇంధన వ్యయం, ఉత్పాదకత నష్టాలు ఆర్థిక వ్యవస్థపై భారాన్ని మోపుతున్నాయి. ప్రధాన నగరాల్లో రద్దీ సమస్యల వల్ల కలిగే నష్టం ప్రతి ఏటా అనేక లక్షల కోట్ల రూపాయలకు చేరుతున్నది. పని గంటల నష్టం, పెరిగే ఖర్చులు, పర్యావరణానికి వాటిల్లే నష్టం, ఉత్పాదకత తగ్గడం-- ఇవన్నీ కలిసి మనం మన రవాణా వ్యవస్థల మీద పెట్టిన పెట్టుబడుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. సమస్య పెట్టుబడుల కొరత కాదు, ఏ వ్యవస్థకు ఆ వ్యవస్థ పరస్పర సంబంధం లేకుండా విడిపోయి కొనసాగటం. మన దేశంలో హైస్పీడ్ రైల్ కార్యక్రమం ఇప్పుడు ప్రకటనల దశ నుంచి అమలు దశకు చేరుకుంది. 2026--27 కేంద్ర బడ్జెట్ ఏడు కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లను ఆమోదించింది. ఇవి సుమారు నాలుగువేల కిలోమీటర్లు కవర్ చేస్తాయి. రైల్వే మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం అవసరమయ్యే మొత్తం పెట్టుబడి సుమారు రూ.16లక్షల కోట్లు. వారణాసి--సిలిగురి లైను మినహా మిగిలిన అన్ని కారిడార్లకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ వివరంగా ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్) పూర్తి చేసింది. తెలంగాణకు ప్రత్యేకంగా హైదరాబాద్-- కేంద్రిక కారిడార్లు



ముఖ్యం. ముంబై--హైదరాబాద్ లైన్ (711 కి.మీ.) డీపీఆర్ పూర్తయ్యింది. కర్ణాటకలో కలబురగి కీలక హబ్‌గా ఎదుగుతోంది. హైదరాబాద్--బెంగళూరు (618 కి.మీ.), హైదరాబాద్--చెన్నై (744 కి.మీ.) కారిడార్లు సర్వే, రీఅలైన్‌మెంట్ దశల్లో ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, వికారాబాద్, కోకాపేట, శంషాబాద్ వద్ద కొత్త స్టేషన్లను ప్రతిపాదించారు. ముంబై--హైదరాబాద్--బెంగళూరు కారిడార్ భారతదేశ అత్యంత ముఖ్యమైన ఆర్థిక ప్రాంతాల్లో ఒకటిగా ఎదుగుతోంది. ఫైనాన్స్, టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్‌ను ఈ కారిడార్ కలుపుతోంది.

# జంధ్యాల పూర్ణిమ ఆగష్టు 28న

మనిషికి మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచి పోషించేది కలివిడితనమే. బహుశా అది లేకేనేమో ఇప్పుడు విచ్చలవిడితన మెక్కువైంది. దీని ఫలితమే ప్రేమ పేరుతో నాగరికత తెలియకముందు నాటి రోజుల్ని తలపిస్తూ ఇప్పుడు జరుగుతున్న నేరాలు, ఘోరాలూనూ, వాటినన్నింటినీ వీడి ఆప్యాయతానురాగాలు, అనుగార బంధంతో జీవనాన్ని సాగించమని పవిత్రమైన శ్రావణపౌర్ణిమను రక్షాబంధన దినోత్సవంగా దేశంలోని త్తరాది ప్రాంతాలు మనరాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లోను ఘనంగా జరుపుకుంటుంటే మరికొందరీ పౌర్ణిమను జంధ్యాల పౌర్ణిమగా జరుపుకుంటారు. ఈరోజు తప్పనిసరిగా ఉపనయనమైన బ్రాహ్మణులందరూ కొత్త జంధ్యం ధరిస్తారు. మనుస్మృతి ప్రకారం జంధ్యం ధరించనిదే నిత్యకర్మలు, పితృకర్మలు చరించేందుకు అర్హత లభించదు. జంధ్యం ధరించాలంటే ఉపనయనం అవ్వాలి. కాబట్టి బ్రాహ్మణులు శాస్త్ర ప్రకారం తమ కుర్రవాడికి ఏనిమిదో ఏటనే ఈ ఉపనయన విధిని జరిపిస్తారు. ఈ జంధ్యంలో మూడు మూడు పోగులు కలిపి క ముడివేసి ఇలాంటివి మూడు ముడులున్న తొమ్మిది పోగులను కలిపి జంధ్యంగా తయారుచేస్తారు. ఈ మూడు పోగులు సత్త్వ రజస్తమో గుణాలకు ప్రతీకలైన త్రిమూర్తులకు సంకేతంగా నిలుస్తాయి. అలాగే మూడు పోగులు మనను రుణానువిధిగా చెయ్యాలని గుర్తు చేస్తుంటాయి. అవే రుషి, పితృ దేవరుణాలన్నమాట."యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతర్యేత్సహజం పురస్తాత్, ఆయుష్యమగ్ర్యంప్రతిమంచ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజ" అంటూ కొత్త జంధ్యాన్ని ధరించి అంతకు ముందున్న జంధ్యాన్ని "ఉపవీత విచ్ఛిన్నతంతు జీర్ణం కస్మల దూషితమ్ విసర్జాని యశోబ్రాహ్మ వర్ఛో దీర్ఘాయురస్తుమే" అంటూ తీసివేస్తారు. ఏమైనా మన విధిని మనం సక్రమంగా నిర్వర్తిస్తే ఫలితం తప్పకుండా అనుకూలంగానే వస్తుంది. అసలు పనినే ప్రారంభించకుండా ఫలితం కోసం చూస్తుండబట్టే ఇప్పుడిన్ని అనర్థాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మనం చేసేది పక్కన పెట్టి ఎదటివారేం చేస్తున్నారని గమనించడమే ఎక్కువైంది. కాబట్టి మనిషిలో అసహనం పెరిగిపోయి ఏవేవో అత్యాచారాలు జరిగిపోతున్నాయి. ఇవేమీ జరగకుండా హాయిగా జీవనం సాగాలంటే ఎవరు చేయ్యాల్సిన పనిని వారు సక్రమంగా చేయ్యాలని సూచించేవే ఈ పండుగలన్నీ. ముఖ్యంగా శ్రావణపౌర్ణిమ స్త్రీ పురుషుల్లో అన్నచెల్లెళ్ళ అనురాగాన్ని ఆత్మీయతాను బంధాన్ని పెంచేందుకు దోహదం చేస్తుంది. ప్రస్తుతం సమాజంలో వెర్రితలలు వేస్తున్న ఆలోచనలకు స్వస్తి చెప్పాలంటే ఇటువంటి భావాలే ఎక్కువ అవసరం. సాక్షాత్తు మహావిష్ణువు అవతారమైన హయగ్రీవుడే సకల విద్యాధి దేవత అయిన సరస్వతీ దేవికి విద్యాభ్యాసం చేశాడట. బలి చక్రవర్తిని మూడడుగులు దానం కోరి ఆ మూడడుగులతోనే పాతాళంలోకి అణగదొక్కిన మహావిష్ణువే రక్షాబంధానికి ప్రతీక అందుకేనేమో రక్షాబంధనం కట్టుకునే సమయంలో దానచక్రవర్తి అయిన బలినే బంధించి ప్రపంచానికే రక్షగా నిలిచిన ఓ రక్షాబంధనమా నిన్ను కట్టుకున్న మాకు కూడా రక్షగా ఉండమంటూ భక్తితో స్మరిస్తూ రాఖీని కట్టుకుంటారు.




కొలనుపాకకుమారస్వామి
9963720669,
వరంగల్.


# మార్కుల కోసం మాతృభాషపై నిర్లక్ష్యమా?!

నేడు రాష్ట్రంలో చాలామంది పిల్లలు తెలుగు మాట్లాడుతున్నారు కానీ, చదవలేరు, రాయలేరు. పుట్టినప్పటి నుంచి అమ్మ మాట వింటూ, అమ్మ భాష మాట్లాడుతూ పెరిగిన విద్యార్థులు చదువులో మాత్రం మాతృ భాష తెలుగును పక్కన పెడుతున్నారు. ఇంటర్మీడియట్‌లో ఎక్కువ మార్కులు సాధించాలన్న ఉద్దేశంతో చాలామంది తల్లిదండ్రులు, విద్యాసంస్థలవారు కూడా విద్యార్థులను తెలుగుకు బదులుగా సంస్కృతం లేదా ఇతర భాషలను రెండో భాషగా ఎంచుకొమ్మని ప్రోత్సహిస్తున్నారు. తెలుగును రెండో భాషగా తీసుకుంటే పరీక్షలో బాగా రాసినా కూడా తక్కువ మార్కులే వస్తాయనీ, అదే సంస్కృతాన్ని ఎంచుకుంటే ఎక్కువ మార్కులు వస్తాయనీ విద్యార్థులు భావిస్తున్నారు. ఇది విద్యార్థుల తప్పు కాదు. తల్లిదండ్రుల తప్పు అని కూడా అనలేము. ఈ విషయంలో మనం మొత్తం విద్యా వ్యవస్థ తీరుపైనే పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ?ఇంటర్మీడియట్‌లో సెకండ్ లాంగ్వేజ్ ఆప్షన్ తెలుగు లేకుండా చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2025--26 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి ఫలితాలను చూస్తే తెలుగు భాషలో విద్యార్థులు ఎంతగా వెనుకబడిపోతున్నారన్నది తెలుస్తుంది. మొత్తం 6,17,827 మంది పరీక్ష రాస్తే.. ఫెయిల్ అయిన విద్యార్థులు 91,150 మంది. ఇందులో తెలుగులో ఫెయిల్ అయిన విద్యార్థులు 37,679. మరోపక్క ఇంగ్లీష్‌లో 8,771 మంది, హిందీలో 1,436 మంది మాత్రమే ఫెయిలయ్యారు. విద్యార్థులు మాతృభాషలోనే వెనుకబడుతున్నారంటే, అది కేవలం విద్యార్థుల సమస్య కాదు. తెలుగు ప్రశ్న పత్రాలు రూపుదిద్దే, మూల్యాంకనం చేసే సరళినే మార్చాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ మూల్యాంకన మార్గదర్శకాల ప్రకారం సంస్కృత ప్రశ్నలకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో సమాధానాలు రాసే అవకాశం ఉండటంతో 100కి 99 మార్కులు సాధించడం సులభమవుతోందన్న అభిప్రాయం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉంది. 90శాతం ప్రైవేట్ కళాశాలలు తెలుగును ఒక ద్వితీయ భాషగా అందించడం లేదు. ఇది మారాలి. పదో తరగతి వరకు అన్ని బోర్డుల్లో తెలుగును తప్పనిసరిగా బోధించినప్పుడు, ఇంటర్మీడియట్ స్థాయిలో సంస్కృతానికి ఇంత ప్రాధాన్యం ఎందుకు? ఇంటర్‌లో రెండో భాషగా తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలను ఎంచుకునే విద్యార్థులకు ఒక విధమైన మార్కుల విధానం, సంస్కృతం ఎంచుకునే విద్యార్థులకు మరో విధమైన ప్రయోజనం ఉండటం ఎందుకు? అలాగే తెలుగు భాషకు మూల్యాంకనం కూడా కఠినంగా ఉందన్న అభిప్రాయం ఉంది. పేపర్ దిద్దే సమయంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలు, వాక్య నిర్మాణం వంటి అంశాలపై కఠినంగా ఉండటం వల్ల విద్యార్థులు మార్కులు కోల్పోయే పరిస్థితి ఉంది. అందువల్ల తెలుగులో 80--85 మార్కుల కంటే ఎక్కువ సాధించడం విద్యార్థులకు కష్టంగా మారుతోంది. దీనిని కూడా మనం తక్షణమే సమీక్షించాలి. ?విద్యార్థులు, తల్లిదండ్రుల మనసుల్లో "తెలుగు చదివితే భవిష్యత్తుకు నష్టం ఉండదు" అన్న నమ్మకాన్ని మన విద్యా వ్యవస్థ కల్పించాలి.? ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో సాధించే మార్కులు ఇూూ జూూాజజు వంటి ప్రవేశ పరీక్షల అవకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రవేశానికి 75శాతం ఇంటర్మీడియట్ మార్కులు అర్హతగా ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో సాధించే మార్కులు, రాబోయే కాలంలో చీజుజు వంటి ప్రవేశ పరీక్షల ర్యాంకులను కూడా ప్రభావితం చేయవచ్చు.




ఇలాంటి పరిస్థితిలో తెలుగును రెండో భాషగా తీసుకుని 20--30 మార్కులు కోల్పోవటానికి విద్యార్థులు సిద్ధంగా ఉండరు. అందుకే తెలుగుకు బదులుగా సంస్కృతం తీసుకుంటున్నారు. భాష ఏదైనా నేర్చుకోవచ్చు. సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్... అన్నీ అవసరమే. కానీ మార్కుల కోసం మాతృభాషను వదులుకోవాల్సిన పరిస్థితి మాత్రం రాకూడదు. మాతృభాషను ఎంచుకున్నా విద్యార్థులు మార్కులు కోల్పోని విద్యా వ్యవస్థ మనకు కావాలి. ?తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మన రాష్ట్రంలో తెలుగు మృత భాషగా మారకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. మెగా డీఎస్సీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్నా భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్, స్మార్ట్ క్లాస్ రూమ్స్... ఇలా విద్యారంగ పరిధిలో ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చిన మంత్రి నారా లోకేశ్ తెలుగు భాష విషయంలో కూడా అభివృద్ధిని సాధించగలరు.? ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. తెలుగు, సంస్కృతం, హిందీ వంటి అన్ని భాషలకు న్యాయమైన, సమానమైన మార్కుల విధానం ఉండేలా ప్రస్తుత విద్యా విధానాన్ని సమీక్షించాలి. తెలుగు ప్రశ్న పత్రాన్ని, తెలుగు సిలబస్‌ను కూడా పునఃపరిశీలించాలి. ప్రస్తుత కాలానికి అనుగుణంగా, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగు బోధన ఉండాలి. తెలుగును కాపాడేందుకు తెలుగులో కూడా 99 మార్కులు వచ్చే విధంగా ప్రశ్న పత్రాల అమరికను మార్చాలి. తెలుగు ఉపాధ్యాయులను కూడా ఈ సంస్కరణల్లో భాగస్వాములను చేయాలి. విద్యార్థి మాతృభాషను ఎంచుకున్నా అతని ప్రతిభకు న్యాయం జరిగేలా మన విద్యా వ్యవస్థ ఉండాలి.

## ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం చోటుచేసుకుంది



**లక్ష్మణ్ చందా,ఆగస్టు 27 (మీ వార్త న్యూస్)**

మండలంలోని నర్సాపూర్ గ్రామ శివారులోని NH-61రహదారి పై మధ్యాహ్నం సమయంలో ఖానాపూర్ నుండి నిర్మల్ కు బయలుదేరిన ఆటో డ్రైవర్ యొక్క నిర్లక్ష్యం వలన అదుపుతప్పి కుడివైపున ఉన్నటువంటి పొలంలోకి దూసుకెళ్లింది.. ఆటోలో ప్రయాణిస్తున్న ప్యాసింజర్ 8, 9 మంది ప్యాసింజర్ లను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగింది.ఇందులో ఉన్నటువంటి ఒక చిన్న బాలుడి పరిస్థితి క్రిటికల్ గా ఉంది.మరియు డ్రైవర్ కూడా గాయాలు అయినవి. సమాచారం అందుకున్న లక్ష్మణ్ చందా పోలీసులు ఇట్టి విషయం గూర్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే పై వార్డు సభను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





ఖిలా వరంగల్ చింతల్ ప్రాంతంలోని మున్సిపల్ కమిటీ హాలులో ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వే పై నిర్వహించిన వార్డు సభను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు సభలో చేపడుతున్న SIR ప్రక్రియ, ఓటర్లకు కల్పిస్తున్న అవగాహన, ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత ఫాం ల ద్వారా సవరణలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. SIR ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వార్డు సభ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఖిలా వరంగల్లు తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

## ఉప్పల్ డివిజన్ లో కొత్త ఓటర్లకు "సర్" సరికొత్త అవకాశం..!

**– ఓటర్లకు అన్యాయం జరుగకుండా చూడాలి ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**





**ఉప్పల్, ఆగస్టు 27 ( మన మీ వార్త):** నిజమైన ఓటర్లకు "సర్" తో ఎలాంటి అన్యాయం జరుగకుండా చూడాలని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.కారణం లేకుండా అకారణంగా తొలగించకూడదని సూచించారు. అయినప్పటికీ జాబితాలో పేరు లేకుంటే ఆధారాలతో తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉప్పల్ డివిజన్ లో గురువారం జరిగిన "సర్" వార్డు సభలకు రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కొత్త ఓటర్లు ఎవరినైనా నమోదు చేసుకొని వారుంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వారు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజయ్య ముదిరాజ్, తుమ్మల దేవిరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,ఖాజా మౌలానా,పబ్బతి వెంకటేష్ గుప్తా, కంచమిది శ్రీనివాస్,కడప నర్సింగ్ రావు,అలుగుల అనీల్ కుమార్,ఈగ రాజేష్, అల్వాలా భాస్కర్,బొమ్మాజీ రత్నం,మహంకాళి రాజు ముదిరాజ్,తుమ్మల రాజేందర్ రెడ్డి, అన్వార్ పాషా,మహేందర్ రెడ్డి, బచ్చా రాము,చెంద్రశేఖర్ రెడ్డి,రంగుల శేఖర్, జిత్తు రెడ్డి,ప్రశాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హనుమకొండ డిపోలో కార్గో పార్సిల్ వస్తువుల వేలం

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



వరంగల్ : వరంగల్ ఆర్టీసీ కార్గో పార్సెల్ ఆఫీస్ నుండి వినియోగదారులు తీసుకవెళ్లని వస్తువులను ఈ నెల 29న వేలం వేయడం జరుగుతుందని హన్మకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వరంగల్ కు బుకింగ్ చేసి వినియోగ దారు తీసుకొని పోకుండా ఉన్నాయని వివరించారు. వాటి కాలపరిమితి దాటినందున అట్టి వస్తువులను హనుమకొండ డిపోలో ఈ నెల 29న శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేలంపాటలో పాల్గొనవలసిందిగా డిఎం కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు నూతన పి.ఆర్.సి ని ప్రకటించి, ఈ.హెచ్.ఎస్ ను వెంటనే అమలు చేయాలి

**- కరీంనగర్ జిల్లా టిజిఈ జేఏసీ డిమాండ్**

**మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి ఆగస్టు 27**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ జేఏసీ పిలుపుమేరకు ఈరోజు కరీంనగర్ జిల్లా జేఏసీ కన్వీనర్ దారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కరీంనగర్ కలెక్టరేట్ ముందు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినారు.ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ జూలై 2023 నుండి అమలు చేయాల్సిన పి.ఆర్.సి ని వాయిదా వేస్తూ, ఆరు డి.ఎ లను పెండింగ్ లో ఉంచడం హాస్యాస్పదంగా ఉందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన పిఆర్సిని జూలై 2023 నుండి అమలుపరుస్తూ, పెండింగులో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరినారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్ ను రద్దు పరుస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,పెన్షనర్ల పెండింగ్ బిల్లులన్నింటినీ ఏక మొత్తంగా మంజూరు చేసి, నూతన ఈ.హెచ్.ఎస్ పథకాన్ని ఏమాత్రం ఆలస్యం లేకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఉద్యోగ, పెన్షనర్లకు వెంటనే అమలయ్యే విధంగా చూడాల్సినటువంటి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందని డిమాండ్ చేసినారు. అదేవిధంగా స్పెషల్ టీచర్లకు నో షనల్ ఇంక్రిమెంట్లను తగిన విధంగా మంజూరు చేస్తూ, రాష్ట్ర పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేటును ఏర్పాటు చేయాలని సూచించినారు. కార్యక్రమంలో టా.ప్ర హుజురాబాద్ అధ్యక్షుడు భారత ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య బాధ్యులు బొంగోని వెంకటయ్య, చొల్లేటి మల్లారెడ్డి, మండల వీరస్వామి గౌరిశెట్టి సాంబయ్య, తాటిపాముల కనుకయ్య,గాజర్ల బుచ్చిరాజం, పెదపాటి రమేష్,తిరునగరి రమేష్,పరాంకుశం సనత్ కుమార్, నల్లా రాజిరెడ్డి,చాడ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల కొరతను పరిష్కరించాలి: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఉప్పల్, ఆగస్టు 27 ( మన మీ వార్త):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా సిబ్బందిపై పనిభారం పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పారిశుద్ధ్య కార్మికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పారిశుద్ధ్య పనులను నిర్వహించడం కష్టంగా మారిందని, దీంతో కార్మికులపై అదనపు పనిభారం పడుతోందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, అవసరమైన స్థాయిలో కార్మికులు లేకపోవడంతో పనులను సకాలంలో పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికులు తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.పారిశుధ్య కార్మికుల కొరతను వెంటనే పరిష్కరించి, అవసరమైన సంఖ్యలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. కార్మికులపై అధిక పనిభారం పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య సేవలను సమర్థవంతంగా కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సానుకూలంగా విన్నారు. సిబ్బంది కొరత అంశాన్ని సంబంధిత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని సూచించారు.ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య నిర్వహణకు కీలకమైన పాత్ర ఉందని ఎమ్మెల్యే పేర్కొంటూ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు నిరంతరాయంగా కొనసాగాలని అన్నారు. చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత తదితర పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, పారిశుధ్య కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి పనిభారాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన చోట అదనపు సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావడంపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యను త్వరగా పరిష్కరించి ఉప్పల్ నియోజకవర్గంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.

# జల్సా లకు అలవాటు పడి మోటార్ సైకిల్ దొంగలించిన వ్యక్తి అరెస్ట్

**– పోలీసులు నిందితుడు నుండి స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిల్ హీరో హోండా స్పెండర్ ప్లస్ TG18A 4517**

**లక్ష్మణ్ చందా ఆగస్టు 27( మీ వార్త న్యూస్)**



**నిందితుడి వివరములు:**

గుండెల శ్రీనివాస రావు S/o సూర్య నారాయణ, వయస్సు: 42 సంవత్సరాలు , కులం : ఎస్సీ -మాల, వృత్తి: తాపి మేస్త్రి R/o H Hî+.9-27-6, రవి గిరి వారి వీది, నెహ్రూ సెంటర్ దగ్గర, కొత్తపేట, విజయవాడ అర్బన్..

నిందితుడు గుండెల శ్రీనివాస రావు సా/శీ సూర్య నారాయణ, అందజ (9) సంవత్సరాల క్రిందట విజయవాడ లో ఉన్నప్పుడు బోర్ పంపు పైపులు దొంగిలించి జైలుకు వెళ్లి వచ్చినాడు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత, తనకు మద్యం త్రాగే అలవాటు ఉండి అతను ఎక్కువ మద్యం తాగటం వలన తరుచూ ఇంట్లో గొడవలు కాగా , ఇక్కడ కాకుండా ఎక్కడైనా పని చేయాలనుకుని నిర్ణయించుకొని తెలంగాణ రాష్ట్రం లోని నిజామబాద్ కి వచ్చి, అక్కడ అడ్డ మీద నుంచి లక్ష్మణ్ చందా గ్రామానికి చెందిన శ్రీను మేస్త్రి తీసుకొని రాగా అతని దగ్గర పని చేశాడు, తర్వాత గత మూడు నెలల కిందట లక్ష్మణ్ చంద నుండి బాల్కొండ గ్రామానికి వెళ్లి అక్కడ మాల్యాద్రి అనే మరొక్క మేస్త్రి దగ్గర పని కుదిరించుకొని అక్కడే పని చేస్తున్నాడు. కానీ వచ్చే డబ్బులు అటు ఇంటికి, తన జల్సాలకు సరిపోక ఏదైనా దొంగతనం చేయాలని నిర్ణయించుకొని, మూడు రోజుల క్రిందట లక్ష్మణ్ చందా గ్రామానికి వచ్చి ఇక్కడే ఉండి , బుధవారం రోజున మద్యాహ్నం 02 గంటలకు సమయంలో ఎద్దండి భీమేష్ రైతు తన ఇంటి ముందట నిలిపిన మోటార్ సైకిల్ ను తాళంచెవి పెట్టి ఉండటాన్ని చూసి , అట్టి మోటార్ సైకిల్ ని దొంగిలించుకొని ధర్మారం గ్రామం వైపు వెళ్లేటప్పుడు హనుమాన్ మందిరం ఇ రోడ్డు వద్ద బైక్ మీది నుంచి క్రింద పడి , దెబ్బలు తగాలటంతో అక్కడానే కొద్ది సేపు ఉండి సోన్ వైపు వెళ్తుండగా సోన్ దగ్గర పోలీసు వారు వాహనాలు తనికి చేయడం ను దూరం నుంచి చూసి తిరిగి వెనక్కి ధర్మారం వైపు వచ్చి పోచమ్మ ఆలయం వద్ద రాత్రి కావటంతో కొద్ది ధూరంలో బైక్ ని నిలిపివేసి ఆలయం ఆవరణలో రేకుల షెడ్డు క్రింద ఆ రాత్రికి అక్కన్నే పడుకున్నాడు. తర్వాత రోజు ఉదయం అందజ 10 గంటల సమయం లో సోన్ వైపు వెళుతుండగా ధర్మారశీ గ్రామ శివారులో పోలీసు వాళ్ళు వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నారు...

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

**----అకారణంగా అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించవద్దు: బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**





**బీరప్ప గడ్డ, ఆగస్టు 27 ( మన మీ వార్త):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఎలాంటి కారణం లేకుండా అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించవద్దని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు.బీరప్పగడ్డ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్డు సభకు బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలతో కలిసి బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓటరు సవరణ కార్యక్రమానికి హాజరైన ఎన్నికల ఇన్‌చార్జ్లు, బీఎల్ఓలతో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ఏ ఒక్కరి ఓటును తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బీఎల్ఏలు కూడా బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ బూత్‌ల వారీగా అవసరమైన పత్రాలను సమర్పించాల్సిన నోటీసులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటర్లుగా ఫారం-6 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కొత్త ఓటర్లకు ఏవైనా సందేహాలు లేదా అపోహలు ఉంటే బీఎల్ఏలు, బీఎల్ఓలు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీరప్పగడ్డ డివిజన్‌కు చెందిన బీఎల్ఓలు, బీఎల్ఏలు, ఎన్నికల ఇన్‌చార్జ్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేవైఎం లడాయి

:- వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

-40 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి.

-జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా యువ మోర్చా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కాశీబుగ్గ జంక్షన్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నేతలు మండిపడ్డారు. నిరంకుశ పాలన సాగిస్తూ విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. బకాయిలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును





దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ?40 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, ఆడెపు రవిరామ్, మున్నా, మహేంత్, అభి మరియు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, ఇనుముల అరుణ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్ మరియు దీజీవీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరయ్యారు ,ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు.

వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22ఖ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో తాసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను సూచించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు పరిష్కరించే విధంగా చర్యలు



తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే



చేయాల్సి ఉంటుందని తెలియజేశారు.

ఈ వీడియో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి,డి ఆర్ వో విజయ లక్ష్మి , సెక్షన్ సూపరెంటెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రామంతపూర్‌లో వార్డు సభలకు హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రఫీక్

---నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి -- మహమ్మద్ రఫీక్

రామంతాపూర్, ఆగస్టు 27 ( మన మీ వార్త):

రామంతపూర్ డివిజన్‌లో గురువారం నిర్వహించిన "సర్ " వార్డు సభలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రఫీక్ హాజరై ఓటర్ల సమస్యలను పరిశీలించారు.

ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, అర్హత కలిగిన నిజమైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని, సరైన కారణం లేకుండా ఏ ఒక్కరి ఓటును తొలగించకూడదని అధికారులకు సూచించారు.

అదేవిధంగా, ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినట్లయితే అర్హతకు సంబంధించిన తగిన ఆధారాలతో వెంటనే దరఖాస్తు చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ప్రజలకు మహమ్మద్ రఫీక్ సూచించారు.

----- కొత్త ఓటర్లకు ప్రత్యేక అవకాశం



18 సంవత్సరాలు నిండిన అర్హత కలిగిన యువత, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని మహమ్మద్ రఫీక్ కోరారు."అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి... నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకూడదు... ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజల



తరఫున నిలబడుతుంది" అని మహమ్మద్ రఫీక్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగపుత్ర భాస్కర్, మిట్టు గౌడ్, సామ్యూల్, ఆదినారాయణ గౌడ్, కేబుల్ అశోక్, గాయత్రి గౌడ్, ఎం.డి. షకీల్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ నోటీసులకు అవసరమైన పత్రాలను గడువు లోగా జారీ చేయాలి:

- వార్డ్ సభలో ములుకలపల్లి రాజేష్ ముదిరాజ్

చిలుకానగర్, ఆగస్టు 27 ( మన మీ వార్త):

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు కీలకమేనని, సర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న పౌరులు ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన పత్రాలను రెవెన్యూ అధికారులు జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ కోరారు.చిలుకానగర్ డివిజన్ పరిధిలో ఎక్కువ మంది ఓటర్లు సర్ నోటీసులపై అవగాహన లేదని పేర్కొన్నారు. కాబట్టి వారి నోటీసులకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించి అందించాలని అధికారులను కోరారు.ఓటర్లు అందుకున్న నోటీసులకు అవసరమైన పత్రాలు అందించే అధికారి వార్డుకు ప్రత్యేక అధికారిగా స్థానిక తహసిల్దార్ ఉండడం వల్ల ప్రజలకు కొంత ఊరట లభించడం జరుగుతుందని అన్నారు. దీంతో ఓటర్ల ఇబ్బందులను పరిష్కరించే అవకాశం ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్ అసెంబ్లీ ఇంచార్జి వరలక్ష్మి , ఏఇఆర్ఓ, ఉప్పల్ ఎంఆర్ఓ పూల్ సింగ్





,సూపెర్వైసోర్ వెంకన్న , సూపెర్వైసోర్ అలివేలు , చిల్కనగర్ ఇంచార్జి జలీల్ పాషా, మేడ్చల్ జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ కొంపల్లి బాలరాజ్ , బ్లాక్ ఏ అధ్యక్షురాలు అమరేశ్వరి , డివిజన్ ప్రెసిడెంట్ నల్లవెల్లి మహేందర్ , వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు , బీసీ సెల్ అధ్యక్షులు దండుగుల శంకర్ , మైనారిటీ సెల్



అధ్యక్షులు మోయునుద్దీన్, ఎస్ సి. సెల్ అధ్యక్షులు శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, అమర్, రాధాకృష్ణ, కిరణ్, రాంచర్ల బలరాం, కూరెళ్ల యాదగిరి,మారపాక సాయిలు, రాములు, సత్యం మరియు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు శోభ రెడ్డి, సంధ్య, విజయ, సమత, సుమలత మరియు బిఎల్ఓ లు బీఎల్ఏ లు అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అలీపురంలో రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ఖిలా వరంగల్ మండలం అలీపురం గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూముల సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి వివరాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రిసర్వే పరిశీలనలో లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వెంట ఎడి సర్వే అధికారి శ్రీనివాసులు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్, బల్దియా కమిషనర్ ను కలిసిన హార్టికల్చర్ అధికారి....

మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

- బల్దియా ఉద్యానవన అధికారిగా ప్రశాంత్...



బల్దియా హార్టికల్చర్ (ఉద్యానవన) అధికారిగా నూతనంగా నియమితులైన తిరునగరి ప్రశాంత్ జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ను కలెక్టరేట్‌లో, బల్దియా కమిషనర్



టి. వెంకన్నను బాలసముద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపు, పార్కుల అభివృద్ధి, మొక్కల సంరక్షణ, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశాంత్ గతంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించారు.

## చెస్ టోర్నమెంట్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

మన మీ వార్త ఆగస్టు27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో ఈ నెల 23న నిర్వహించిన కల్లెడ చెస్ టోర్నమెంట్ లో మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభను కనబరచి పలు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

విజేతలుగా నిలిచిన విద్యార్థులలో రెండవ స్థానంలో (ఓవరాల్) దీలీషా --8 వేల రూపాయల నగదు బహుమతి, నాలుగవ స్థానంలో శ్రీ లాస్య --2 వేల రూపాయల నగదు బహుమతి, ఐదవ స్థానంలో దక్షణిక 2 వేల రూపాయల నగదు బహుమతి నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులను, వారికి శిక్షణ అందించిన చెస్ కోచ్ జి. జ్యోత్స్నను జోనల్ ఆఫీసర్లు పి. అప్పారావు,అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ విజయ కుమారి, ఉపాధ్యాయులు వాణి ప్రియాంక, పిఇటి శ్రీదేవి మరియు పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## మహబూబాబాద్ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



మన మీ వార్త ఆగస్టు27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




ఈ వీసీ కి జిల్లా కలెక్టరెట్ లోని వీసీ హల్ నుండి కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు .ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్... భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు.

వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22ఖ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో తాసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను సూచించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 27 ( మన మీ వార్త):**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో లోగో ఆవిష్కరణతో పాటు ఏడు రోజుల నిరసన కార్యక్రమాలపై ప్రారంభ ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 2న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, బహిరంగ కరపత్రాల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీల ప్రదర్శన చేపట్టనున్నారు.సెప్టెంబర్ 3న వ్యవసాయ రంగంలో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రైతు నిరసనలు, 22 ఏ సీడ్ల భూముల కోసం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 4న విద్యార్థులు, వికలాంగులు, మహిళలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు.సెప్టెంబర్ 6న ఆదిలాబాద్, హైదరాబాద్‌తో పాటు గ్రామస్థాయిలో వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 7న ప్రజావాణిలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నారు. సెప్టెంబర్ 8న జిల్లా కేంద్రాల్లో ఏడు రోజుల కార్యక్రమాలపై ప్రెస్‌మీట్ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించనున్నారు. ఈ కార్యక్రమాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

## హన్మకొండ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ,సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**




జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీసీ కి జిల్లా కలెక్టరెట్ లోని వీసీ హల్ నుండి కలెక్టర్ చాహత్ బాజ్ పాయిలిహాజరయ్యారు .ఈ



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్... భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22ఖ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో తాసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను సూచించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు,.

## 44వ జాతీయ రహదారిపై రైతుల ధర్నా





**ఆగస్టు 27 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**

అవసరమైన సమయంలో పంటకు యూరియా అందకపోవడంతో నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని మాసాయిపేట 44వ జాతీయ రహదారిపై రైతులు రాస్తా రోకో నిర్వహించారు దీంతో ఐదు కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది అనంతరం రైతులు మాట్లాడుతూ కొత్త యాప్ ద్వారా క్షణాలలోని యూరియా బుక్ కావడంతో తమకు అందడం లేదని వాపోయారు యాప్ విధానాన్ని తొలగించి గతంలో మాదిరిగా దుకాణం ద్వారా యూరియా వీక్రయించాలని డిమాండ్ చేశారు మాసాయిపేటలో సహకార సంఘానికి 550 బస్తాల యూరియా త్వరగా ఇతర మండలాల నుంచి అప్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇవ్వడం జరుగుతుందని మండిపడ్డారు దీంతో రైతుల వద్దకు చేరుకున్న చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింప చేశారు

## సర్ రెండో దశలో హెచ్ఎంటీ నగర్ వార్డు సభ లో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గం బిజెపి బీఎల్ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్







**నాచారం, ఆగస్టు 27 ( మన మీ వార్త):**

సర్ రెండో దశలో భాగంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్, హెచ్ఎంటీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం వార్డు సభ నిర్వహించారు. నాచారం సర్కిల్ ఏ ఈ ఆర్ ఓ నిత్యానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ బి ఎల్ ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎ.ఈ.ఆర్. ఓ నిత్యానంద్ మాట్లాడుతూ, ఇప్పటికే నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ అధికారులు సూచించిన 11 రకాల పత్రాల్లో ఏదైనా ఒక పత్రాన్ని సరైన ధ్రువీకరణతో బి ఎల్ ఓ కు సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని సూచించారు.అలాగే కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, వివరాల్లో మార్పులు, చిరునామా తదితర అంశాలకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 వినియోగం, విధివిధానాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు యశ్వంత్, ప్రదీప్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బి ఎల్ ఏ-2లు పాల్గొన్నారు. బీజేపీ ఉప్పల్ నియోజకవర్గం బి ఎల్ ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి యోగేశ్వర్ రెడ్డి, బి ఎల్ ఏ-2లు క్రాంతి కుమార్, శ్రీనివాస్ యాదవ్, హెచ్ఎంటీ నగర్ కాలనీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి మంజుల వాణి, బి ఎల్ ఏ-2 కిరణ్ కుమార్, హెచ్ఎంటీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదిరెడ్డి, రామకోటేశ్వర్ రావు, కార్యదర్శి బాలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వార్డు సభకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సర్ ప్రక్రియపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## జిల్లా వ్యవసాయ అభివృద్ధిపై క్షేత్ర స్థాయిఅధికారుల తో సమీక్ష

**మన మీ వార్త ఆగస్టు 27వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుండి క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, రైతులను ఆరుతడి పంటల సాగువైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,39,997 ఎకరాల్లో గత సంవత్సరం వరి సాగు అయింది, ఈ సంవత్సరం ఇప్పటివరకు 64,293 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వరి సాగు చేయాల్సిన మిగిలిన 75,704 ఎకరాల్లో ఇప్పటివరకు 33,438 ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు సాగు చేసినట్లు తెలిపారు. మిగిలిన విస్తీర్ణంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ముఖ్యంగా ఖానాపురం ప్రాంతంలో పాకాల నీరు




అందుబాటులో ఉన్నందున వరి సాగు చేయవద్దని రైతులకు సూచించినప్పటికీ కొందరు రైతులు వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇకపై నీటి లభ్యత, భూసార పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇంకా ఆరుతడి పంటలు సాగు చేయని రైతులను గుర్తించి, ఆయా మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆరుతడి పంటల సాగు లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువులను ఫర్టిలైజర్ యాప్ ద్వారా మాత్రమే కాకుండా ఇతర మార్గాల్లో అక్రమంగా విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఫార్మర్ రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అలాగే పంటల సర్వేను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు లు వివిధ మండలాల వ్యవసాయ ,ఉద్యానవన శాఖ క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## హన్మకొండ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలి

- గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్ )ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యమని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు .ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగం గ్రామ సభలను నిర్వహిస్తున్న నేపథ్యంలో... గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలో ని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతున్న గ్రామసభ నిర్వహణ తీరు కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు ఇచ్చార, లేదా అని బి ఎల్ ఓ బి ఎల్ ఏ, సూపర్వైజర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... డ్రాఫ్ట్ ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించాలని.. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, శాశ్వతంగా నివాసం మారిన ఓటర్ల వివరాలు, డబుల్ ఎంట్రీగా నమోదైన ఓటర్ల గుర్తింపు, గైర్హాజరైన ఓటర్ల జాబితా తదితర వివరాలను ప్రజలకు వెల్లడించాలాన్నారు ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు ఈ గ్రామ సభలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా గ్రామ సభలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సరైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని, ప్రతి ఒక్కరూ ాౌ×= ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సరిచూసుకోవాలన్నారు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అధికారులు తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభల్లో దీూాలు, దీూా లు,సూపర్‌వైజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొని నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు

అనంతరం అదే గ్రామం లో నిర్మాణం అవుతున్న ప్లాస్టిక్



వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ ని కలెక్టర్ సందర్శించి ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు షెడ్ నిర్మాణ పనులు వేగవంతం కావాలని... వారం రోజుల్లో రూఫ్ షీటింగ్ పనులు పూర్తి కావాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు .ఈ కార్యక్రమం లో సర్పంచ్ మహేశ్వరి, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి,ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హుల ఓటు జాబితాలో ఉండేలా చూడాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా

**(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఎస్?ఐఆర్?లో భాగంగా బీఎల్ వోలు పలువురికి నోటీసులు అందిస్తుండగా క్షేత్రస్థాయిలో కలెక్టర్? ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు.



**19వ డివిజన్?లో..**

దనగరంలోని 19వ డివిజన్ పరిధిలో ఉన్న కంఠేశ్వర్?లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని కలెక్టర్? పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని కలెక్టర్? ఆదేశించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని తెలిపారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీఎల్?వోలు సూపరింటెండెంట్? మురళి, బీఎల్వోలు లావణ్య తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి వెయ్యి రోజుల సెగ

**- 420 హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట**

**- సెప్టెంబర్ 2 నుంచి ఎనిమిది రోజుల పాటు నిరసనలు**

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 27 మీ వార్త**

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెప్టెంబర్ 2తో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 420 హామీలు అమలు ఏవి, కాంగ్రెస్ పార్టీ వివిధ డిక్లరేషన్లు, మేనిఫెస్టోల ద్వారా ప్రజలకు 420 హామీలు ఇచ్చిందని నిరంజన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించారని, ఇప్పుడు వాటి అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న చార్జ్‌షీట్, సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో నిరసన కార్యక్రమాల లోగోను ఆవిష్కరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి ఎనిమిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలపై ధర్నాలు, సెప్టెంబర్ 2న ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాలపై నియోజకవర్గాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. బాకీ కార్డులు పంపిణీ చేయడంతో పాటు 420 మీటర్ల ఫ్లెక్సీల ప్రదర్శన చేపడతామన్నారు. రైతు సమస్యలపై సదస్సులు, సెప్టెంబర్ 3న వ్యవసాయ రంగ సమస్యలపై గ్రామీణ ప్రాంతాల్లో రైతు సదస్సులు, హైదరాబాద్‌లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న వ్యవసాయ భూములు, సాగునీరు, విద్యుత్, యూరియా, ఎరువులు, రైతుబీమా అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తామన్నారు. మహిళల హామీలపై వంటా వార్పు,
సెప్టెంబర్ 4న మహిళలకు రూ. 2,500, కేసీఆర్ కిట్, షాదీ ముబారక్, తులం బంగారం, విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీల



అమలును డిమాండ్ చేస్తూ వంటా వార్పు నిర్వహిస్తామని చెప్పారు. యువతతో ర్యాలీలు, సెప్టెంబర్ 5న జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్, యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువత, విద్యార్థులతో నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదిలాబాద్, సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలోని 12 నియోజకవర్గాల్లో ప్రత్యేక నిరసనలు ఉంటాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఆటోలతో ర్యాలీ, సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. తాగునీరు, వీధిదీపాలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బస్తీ దవాఖానాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇతర నియోజకవర్గాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యలపై నిరసనలు చేపడతామని చెప్పారు. ప్రజావాణిలో సామూహిక వినతులు, సెప్టెంబర్ 7న అన్ని జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో 420 హామీల అమలుపై సామూహిక వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 8న జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించి అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు మద్దతు, సెప్టెంబర్ 10న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది రోజుల కార్యక్రమాలతో పాటు ఆయా సంఘాల ఉద్యమాలకు కూడా మద్దతుగా నిలుస్తామని చెప్పారు. గ్యారంటీ కార్డులపై విమర్శలు, ఎన్నికల సమయంలో గ్యారంటీ కార్డులు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేసి ప్రజలకు హామీలు ఇచ్చారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు హామీలను విస్మరించారని



విమర్శించారు.
నిరుద్యోగ భృతి ఏమైంది, నిరుద్యోగ భృతి, ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి హామీల అమలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో భర్తీ ప్రక్రియ పూర్తయిన ఉద్యోగాలకు నియామకపత్రాలు అందిస్తూ వాటిని తమ ఘనతగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఆరోపించారు. రైతులకు ఇబ్బందులు నిరంజన్‌రెడ్డి, రైతులకు యూరియా, ఎరువులు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కూడా ఆయన విమర్శలు చేశారు.
రాహుల్‌గాంధీ తెలంగాణ యువతతో మాట్లాడాలి... యువత గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ తెలంగాణలోని అశోక్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి నిరుద్యోగ యువతతో మాట్లాడాలని నిరంజన్‌రెడ్డి కోరారు. తెలంగాణ యువత ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఉద్యమంలో పాల్గొనాలి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వెయ్యి రోజుల సమయం ఇచ్చామని, ప్రతిపక్షంగా శాసనసభ లోపల, బయట ప్రజా సమస్యలపై పోరాడామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇక ప్రజలు మౌనం వీడి బీఆర్ఎస్ ప్రకటించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వాన్ని హామీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవీ ప్రసాద్‌రావు, సతీష్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు...

# పల్లె దవాఖానను కాపాడుకుంటాం అంటున్న కౌకూర్ ప్రజలు

**- "పల్లె దవాఖానకు తాళం వేసే అధికారం ఎక్సైజ్ శాఖకు ఎవరిచ్చారు?"**

**యాప్రాల్ ఆగస్టు 27: (వార్త ప్రతినిధి)**

కౌకూర్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన పల్లె దవాఖాన, గ్రామ సబ్ సెంటర్‌ను వెంటనే తెరవాలని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ కార్యాలయంగా మార్చడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎక్సైజ్ కార్యాలయం వల్ల ముఖ్యంగా సీజ్ చేసిన వాహనాలను పెద్ద సంఖ్యలో నిల్వ చేయడం, వాహనాల రాకపోకలు పెరగడం, పార్కింగ్ సమస్య, రోడ్ల ఆక్రమించబడే పరిస్థితి, ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం కావడం వంటి ప్రధాన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు మరియు పాదచారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో సీజ్ చేసిన వాహనాలను నిల్వ చేయడం వల్ల ప్రజా భద్రత, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగవచ్చని



తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భవనాన్ని ఎక్సైజ్ కార్యాలయానికి కాకుండా వార్డు ఆఫీస్, స్ట్రీట్ లైట్స్ ఆఫీస్, యువతకు జిమ్, విద్యార్థులకు గ్రంథాలయం మరియు సానిటేషన్ కార్యాలయం వంటి ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావ్ ఇచ్చిన పత్రాన్ని కూడా అందజేశారు. "మాకు దవాఖాన కావాలి -- ఎక్సైజ్ ఆఫీస్ కాదు!
మాకు ట్రాఫిక్ రహిత కౌకూర్ కావాలి -- సీజ్ వాహనాల పార్కింగ్ కాదు!



మోడల్ మార్కెట్ ప్రజల కోసం -- ఎక్సైజ్ శాఖ కోసం కాదు!"
ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేస్తే కౌకూర్ ప్రజల తరఫున మరింత బలమైన ప్రజా ఉద్యమం చేపడతామని తుడిమెళ్ల మల్లికార్జున్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మేకల శ్రీనివాస్ యాదవ్, శివరాజ్, ఆసిఫుల్లా ఖాన్, శంకర్, మహేష్, శ్రీకాంత్ తదితరులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. -- తుడిమెళ్ల మల్లికార్జున్ మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు & సామాజిక కార్యకర్త

# జవహర్‌నగర్‌లో ఇళ్ల అనుమతులు, ఇంటి నంబర్లపై ఎమ్ ఎమ్ సి కమిషనర్ సమీక్ష

**--- కీసర, కాప్రా సర్కిళ్లలో ఆకస్మిక తనిఖీలు**

**జవహర్ నగర్ ఆగస్టు 27: (వార్త ప్రతినిధి)**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్‌నగర్, చంద్రపురి కాలనీలో ఇళ్ల నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్ల జారీ ప్రక్రియపై ఎమ్ ఎమ్ సి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. గ్రామ కంఠం పరిధిలోని గృహాలతో పాటు జీఓ 58, 59 పట్టాలు కలిగిన అర్హులైన యజమానులకు నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు వేగవంతంగా జారీ చేసేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది



హాజరు తనిఖీ: కాప్రా సర్కిల్ పరిధిలోని ఏ ఎస్ రావు నగర్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ ఎఫ్ ఏ లు, పారిశుద్ధ్య కార్మికుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బంది సమయపాలనతో కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎస్ సి టి పి కేంద్రం పరిశీలన: సాయి ప్రియ కాలనీలోని సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌పోర్టేషన్ పాయింట్ ను సందర్శించి వ్యర్థాల సేకరణ, పారిశుద్ధ్య వాహనాల ఎంట్రీ-ఎగ్జిట్ నమోదు విధానాన్ని తనిఖీ చేశారు. చెత్త రవాణా వ్యవస్థలో పూర్తి పారదర్శకత, బాధ్యతాయుత పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పౌరులకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు సిబ్బంది జవాబుదారీతనం, అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ అత్యంత కీలకమని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు అడుగులు

**ఒంగోలు :** ప్రకాశం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఇప్పుడు ముఖ్యమంత్రిగా తానే ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అయితే వివిధ కారణాలతో పనులు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగామని సీఎం పేర్కొన్నారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పునాదికి ఇప్పుడు ఫలితం కనిపించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చంద్రబాబు అన్నారు. తన సంకల్పం నెరవేరుతున్న ఈ సందర్భాన్ని ఒక గొప్ప అనుభవంగా ఆయన అభివర్ణించారు. దీనికి సంబంధించిన 1996 నాటి ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. వెలిగొండ మొదటి దశ పూర్తవడంతో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వర్షాలపై ఆధారపడే రైతులకు ఎంతో ఊరట లభించనుంది. వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది. తాగునీటి విషయంలోనూ ఈ ప్రాజెక్టు కీలక ప్రయోజనాన్ని అందించనుంది.



## సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ.

**రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు.**

**జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టిన రాష్ట్ర మంత్రి సీతక్క ...**

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్ర



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, జి. సంపత్ రావులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రాఖీ పండుగను పురస్కరించుకొని ముందస్తుగా మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పన్నుల సేకరణ, అసెస్మెంట్లపై ప్రత్యేక దృష్టి -- అదనపు కమిషనర్ జోనా

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



జిడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఈ నెల 12వ తేదీన సమీక్షించిన పన్నుల సేకరణ, అసెస్మెంట్ల పురోగతిపై బల్దియా కమిషనర్ టి. వెంకన్న ఆదేశాల మేరకు గురువారం అదనపు కమిషనర్ జోనా రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.
సర్కిల్ వారీగా ఆస్తి, నీటి పన్నుల వసూళ్ల పురోగతిని సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అసెస్మెంట్, అన్‌కలెక్టబుల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నగరంలోని అపార్ట్‌మెంట్లు, పన్ను పరిధిలోకి రాని భవనాలను గుర్తించి అసెస్మెంట్ చేసి పన్ను పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదికను కమిషనర్‌కు సమర్పించాలని అదనపు కమిషనర్ జోనా ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీపై సంచలన ఆరోపణలు

**జవహర్ నగర్ ఆగస్టు 27: (వార్త ప్రతినిధి)**

తెలంగాణలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీపై అక్రమాలు, డబ్బుల డిమాండ్, ఇంటర్వ్యూ మార్కుల వ్యవహారంపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.
పోస్టుల కోసం డబ్బులు తీసుకుంటున్నారా?
ఇంటర్వ్యూ మార్కులతోనా మెరిట్‌ను తారుమారు చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2026 నియామక ప్రక్రియలో ఇంటర్వ్యూకు 10 మార్కుల వెయిటేజీ ఉన్నట్లు సమాచారం.




- ఇంటర్ మార్కులు - 70% వెయిటేజీ
- వితంతువులు / విడాకులు / అనాథలకు - 5% - 10% వెయిటేజీ
- ఇంటర్వ్యూకి - 10 మార్కులు

అయితే ఈ ఆరోపణల్లో నిజమెంత?
ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత ఎక్కడ? అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉంది.

## సీపీ సాయిచైతన్యకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు




**(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీలు గురువారం సీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్యను కలిశారు. శాంతియుతంగా జరుపుకోవాలి. బ్రహ్మకుమారీలు పోలీస్ కమిషనర్ (సాయి చైతన్య )?కు రాఖీ కట్టి , రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో శాంతి భద్రత, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలను వారు కొనియాడారు. రాఖీ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. బ్రహ్మకుమారీలు వనజ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# ఓటరు వివరాలు పరిశీలించుకోవాలని సర్పంచ్ సూచన

**కాసిపేట, ఆగస్టు 27 : (మనమీ వార్త మండల ప్రతినిధి)**



కాసిపేట మండలం తాటిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో 'ఎస్ఐఆర్-2026' ముసాయిదా ఓటరు జాబితాపై గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలోని తమ పేర్లు, ఇతర వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు.అధికారుల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను గ్రామస్తులకు చదివి వినిపించారు. ఓటర్ల పేర్లు, వివరాల్లో ఉన్న తప్పులు, సందేహాలు, అభ్యంతరాలు, సవరణలపై గ్రామస్తులతో చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, దరఖాస్తులను అధికారులు నమోదు చేసుకున్నారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుని తప్పులను సరిదిద్ది తుది ఓటరు జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి, శ్యామ్‌శేఖర్, వార్డు సభ్యులు మడావి దేవు, మడావి జమున, సిడం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, బూత్ స్థాయి అధికారి కొయ్యాల సరోజ, పంచాయతీ సిబ్బంది, గ్రామ యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 150 గ్రాముల గంజాయి స్వాధీనం - నిందితుడికి రిమాండ్

**కాసిపేట, ఆగస్టు 27 : (మనమీ వార్త మండల ప్రతినిధి)**



దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయితో పట్టుబడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బెల్లంపల్లి నివాసి ఎస్‌కే జమీర్ దేవాపూర్ ఎం.పి.పి.ఎస్ పాఠశాల ఎదుట అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడి వద్ద ఉన్న నల్లటి కవర్‌ను తనిఖీ చేయగా 150 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు.నిందితుడు ఎస్‌కే జమీర్ వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. విచారణలో గంజాయి వినియోగదారులు, ఇతర వ్యక్తులకు విక్రయించినట్లు సమాచారం వెల్లడైనట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌కే జమీర్‌పై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి)తో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరికొందరిపై గంజాయి వినియోగానికి సంబంధించిన నిబంధనల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.చట్టపరమైన ప్రక్రియ అనంతరం నిందితుడిని ఆగస్టు 27న కోర్టులో హాజరుపరిచి లక్సెట్టిపేట జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా దేవాపూర్ ఎస్ఐ ఎ. గంగారం మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# టీచర్లపై దాడికి యత్నం.. కేసు నమోదు చేసిన పోలీసులు..



**(మన మీ వార్త న్యూస్): ఆగస్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి) :-**

టీచర్లపై దాడికి యత్నించిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది.

**గర్ల్స్ స్కూల్‌లో..**

రెండో టౌన్ ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరం లోని గర్ల్స్ స్కూల్‌లో గురువారం ఉదయం పదో తరగతి విద్యార్థిని ఛాతిలో నొప్పి రావడంతో ఉపాధ్యాయులు వెంటనే స్పందించి 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ క్రమంలో టీచర్లు నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ విద్యార్థిని మేనమామ, మేనబావలు టీచర్లపై దుర్భాషలాడారు. వారి విధులకు ఆటకం కలిగించారు. చెప్పుతో కొడతామని టీచర్లకు బెదిరించడంతో వారు రెండో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులు అమ్మాయి బంధువులు పాల్ ఫిలిప్, దాస్, ఎబినేజర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

**కాసిపేట, ఆగస్టు 27: (మనమీ వార్త మండల ప్రతినిధి)**

కాసిపేట మండలం రొట్టెపల్లి గ్రామంలో నర్సింగరావు చెరువుకు వెళ్లే మార్గంలో గుట్టబోరు సమీపంలోని మొక్కల తొలగింపు వ్యవహారంపై అటవీ అధికారులు స్పందించారు. అటవీ ప్రాంతంలో దారి పక్కన ఉన్న భారీ మొక్కలను యంత్రాలు, ఇతర పరికరాలతో వేర్లతో సహా తొలగించిన ఘటనపై అధికారులు స్థలాన్ని పరిశీలించారు.తొలగించిన చెట్లను పూర్తిగా లెక్కించి, వాల్టా నిబంధనల ప్రకారం జరిమానా విధించనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఎన్ని మొక్కలు, చెట్లు తొలగించారో గుర్తించిన అనంతరం వాటన్నింటికీ నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.జరిమానాతో పాటు తొలగించిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను నాటించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు

# ములుగు జిల్లాను అభివృద్ధి వెలుగులతో విరాజిల్లేలా కృషి చేయాలి.

- ఆరు నెలల్లో రహదారుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**మన మీ వార్త ఆగస్టు 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





వెనుకబడిన ములుగు జిల్లాను అభివృద్ధి వెలుగులతో విరాజిల్లేలా అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు.
గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల, రహదారులు--భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, జాతీయ రహదారులు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, తెలంగాణ వైద్య సేవలు--మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, విద్యా--సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులను శాఖలవారీగా సమీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టాల్సిన నూతన అభివృద్ధి పనులను గుర్తించి, సంబంధిత ప్రాజెక్టులకు సమగ్ర అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించిన వివరాలను శాఖలవారీగా నమోదు చేయాలని సూచించారు.
అభివృద్ధి పనుల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, పనులను సకాలంలో పూర్తి చేయని గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.
రామప్ప--లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను నిరంతరం రామప్ప సరస్సుకు తరలించే సాధ్యాసాధ్యాలను వెంటనే పరిశీలించాలని సూచించారు. రామప్ప సరస్సు నుంచి ములుగు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలను రూపొందించాలన్నారు.
రామప్ప ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు నూతన పర్యాటక అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మేడారం జాతర ప్రాంతంలో జంపన్నవాగు సుందరీకరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. మేడారంలో నూతనంగా నిర్మించనున్న అతిథిగృహాన్ని రెడ్డిగూడెం ప్రాంతంలోని గుట్టపై నిర్మించే అవకాశాలను పరిశీలించాలన్నారు.
మేడారం రింగ్‌రోడ్డు ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ఘాట్ వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.
జిల్లాలో కొనసాగుతున్న రహదారుల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మల్లూరు ప్రాంతంలో నూతన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.
యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల, నర్సింగ్ కళాశాలతోపాటు జిల్లాలో కొనసాగుతున్న ఇతర భవన నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో, నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు విధి నిర్వహణను బాధ్యతగా భావిస్తూ ఉత్తమ పనితీరుతో ప్రజల ప్రశంసలు పొందాలని మంత్రి సూచించారు.
అనంతరం మంత్రి సీతక్క మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాల భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.
గోదావరి జలాలు ఈ ప్రాంతం నుంచి అనేక ప్రాంతాలకు తరలిపోతున్నప్పటికీ, స్థానికంగా సాగునీటి సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.
రామప్ప--లక్నవరం అనుసంధాన పనులు, పొట్లాపూర్ ఎత్తిపోతల పథకం, రామచంద్రాపురం--మల్లంపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న, చేపట్టబోయే పనుల పురోగతితోపాటు వాటికి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై సమీక్షించినట్లు తెలిపారు.
రామప్ప సరస్సును నింపడం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూములు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో అవసరమైన భూసేకరణ చేపట్టి, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.
నీటిపారుదల శాఖ పరిధిలో అవసరమైన ఘాట్ల నిర్మాణంతోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించినట్లు వెల్లడించారు.
కొన్ని కార్యాలయాల్లో అధికారులు సక్రమంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి సీతక్క తెలిపారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాగృతి కళాశాల ఫ్రెషర్స్ డే







- తెలంగాణ బోనాలు, బతుకమ్మ నృత్యాలతో అలరించిన విద్యార్థులు
- రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు ఘన సన్మానం
- రాష్ట్రస్థాయి ర్యాంకులే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలి
- కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చు
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్‌కుమార్

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగష్టు 27 మీ వార్త**

వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జాగృతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు. 16 ఏళ్లుగా ఉత్తమ ఫలితాలు,ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ...గత 16 సంవత్సరాలుగా సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో జాగృతి కళాశాల విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఎంపీసీ లో 468/470.. రాష్ట్రస్థాయి ప్రతిభ2026 విద్యా సంవత్సరంలో ఎంపీసీ లో 468/470 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. అదేవిధంగా బైపీసీ లో 438 మార్కులు, ఎమ్ఈసి లో 460, సిఈసి లో 491 మార్కులు సాధించి విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు.

**సాధారణ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య...**

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే సాధారణ విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారని చెప్పారు.కసితో చదివితే సాధించలేనిదేమీ లేదు,విద్యార్థులు ఆత్మన్యూనత భావాన్ని విడిచిపెట్టి పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదవాలని కళాశాల యాజమాన్య సభ్యులు సూచించారు. అధ్యాపకులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పాఠాలను ఎప్పటికప్పుడు మననం చేసుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.కాచిన చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయి.. చెక్కనిదే శిల కడుపున శిల్పం ఎలా పుడుతుంది" అనే మాటలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

**ప్రతిభావంతులకు ఘన సన్మానం...**

ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. శాలువాలు, బొకేలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలిపింది.ఐఐటీ , జీ ,ఈఎపిసిఈటీ , నీట్ లోనూ సత్తా,2026లో ఐఐటీ , జీ మైన్స్ , ఈఎపిసిఈటీ , నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని కళాశాల ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా విద్యా బోధనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామన్నారు.

**తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు...**

ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తెలంగాణ బోనాలు, బతుకమ్మ పండుగల నేపథ్యంతో చేసిన నృత్యాలు, కోలాటాలు, పాటలతో సందడి చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆకట్టుకున్నాయి.

**విద్యార్థులకు యాజమాన్యం అభినందనలు...**

కళాశాల యాజమాన్య సభ్యులు శ్యాంకుమార్, భాస్కర్, సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఇతర ప్రాంతాల్లోని కార్పొరేట్ కళాశాలల వైపు చూడకుండా తమకు అందుబాటులో ఉన్న మంచి విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో, నిరంతర సాధనతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్‌కుమార్, యాజమాన్య సభ్యులు శ్యాంకుమార్, భాస్కర్, సత్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు...

## మధురానగర్ కాలనీలో 'నా వస్త్రం కలెక్షన్స్' ను ప్రారంభించిన ఆకారపు అరుణ్ పటేల్

**రామంతపూర్, ఆగస్టు 27 ( మన మీ వార్త):**

మధురానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'నా వస్త్రం కలెక్షన్స్' షాపును ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా షాప్ యజమాని మైకేల్ మాట్లాడుతూ తమ షాపులో అందుబాటులో ఉన్న వివిధ రకాల స్టైలిష్ వస్త్రాలు, నూతన మోడల్స్ గురించి వివరించారు. అన్ని వర్గాల వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.మధురానగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు 'నా వస్త్రం కలెక్షన్స్'ను సందర్శించి నాణ్యమైన, ఆధునిక డిజైన్ల వస్త్రాలను కొనుగోలు చేసి ఆదరించాలని నిర్వాహకులు కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాను, రంజిత్ రెడ్డి, భాష, సుమిత్, గణేష్, సాయి తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. షాప్ నిర్వాహకులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



# ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించని స్థాయిలో పిచ్చిమొక్కలు

- బుద్దారం హరిజనవాడలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- అత్యవసర సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరేదెలా
- గ్రామస్తుల ఆందోళన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పిచ్చిమొక్కలు తొలగించేలా లైన్‌మెన్లకు ఆదేశాలు'
- ఏఈ హామీ వెంటనే పరిశుభ్రం చేయిస్తామని హామీ

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 27 మీ వార్త**

గోపాలపేట : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి బుద్దారం గ్రామంలోని పరిస్థితులు అద్దం పడుతున్నాయి. మండలంలోని బుద్దారం హరిజనవాడతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, తీగలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో విద్యుత్ పరికరాలు కనిపించని స్థాయిలో పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో పెరిగిన చెట్లు, తీగలు స్తంభాలను చుట్టుముట్టడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడుందో వెతకాల్సిందే...**

హరిజనవాడలోని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నెలల తరబడి పొదలు పెరుగుతున్నా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లే మార్గం సైతం ముళ్లచెట్లతో మూసుకుపోయిందని చెబుతున్నారు. దీంతో విద్యుత్ సిబ్బంది సాధారణ తనిఖీలు, మరమ్మతులు చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది.

**అత్యవసర సమయంలో పరిస్థితి ఏమిటి...**

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం ఏర్పడినా, షార్ట్‌సర్క్యూట్ జరిగినా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే దట్టంగా పెరిగిన పొదలు, ముళ్లచెట్ల కారణంగా అత్యవసర సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకోవడం కష్టంగా మారిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేసే కంటే ముందుగానే పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

**వర్షాకాలంలో మరింత ముప్పు...**



ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పచ్చదనం మరింతగా పెరిగింది. తడి వాతావరణంలో విద్యుత్ లీకేజీ వంటి సమస్యలు తలెత్తితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పొలాలకు, పశువుల కాపరులు తమ పశువులతో రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఉండటం ప్రమాదకరమని చెబుతున్నారు.పొదల్లో విషసర్పాల సంచారం,దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కల కారణంగా విషసర్పాలు, ఇతర విషపూరిత జీవులు ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లోకి చేరుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో విద్యుత్ ప్రమాదంతో పాటు పాముల బెడద కూడా ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

**ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా...**

విద్యుత్ పరికరాల చుట్టూ ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. బుద్దారం హరిజనవాడలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన మొక్కలు, తీగలను తొలగించి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.కనీస పనులను కూడా పట్టించుకోవడం లేదు,విద్యుత్ శాఖ గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తున్నప్పటికీ, కనీస నిర్వహణ పనులను పట్టించు కోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, అల్లుకున్న తీగలను వెంటనే తొలగించాలి. రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి. వీధుల్లో కరెంట్ సమస్య ఏర్పడితే ట్రాన్స్‌ఫార్మర్‌ను నిలిపివేయడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. అని బుద్దారం గ్రామస్థుడు పానుగంటి పెద్ద వెంకటేష్ అన్నారు.

**ఇకనైనా చర్యలు తీసుకునేనా...**

బుద్దారం హరిజనవాడలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, తీగలను తొలగించి, అవసరమైన చోట రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారులు వెంటనే తొలగిస్తామని హామీ...**

ఈ విషయంపై విద్యుత్ శాఖ గోపాలపేట ఏఈ సుధాకర్ మాట్లాడుతూ...గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని




ఇప్పటికే లైన్‌మెన్లకు సూచనలు ఇచ్చామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు పెరిగి ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని పరిశీలించి వెంటనే తొలగించేలా సిబ్బందికి మరోసారి ఆదేశాలు ఇస్తామని చెప్పారు.ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల విద్యుత్ ప్రమాదాలను నివారించడంతో పాటు సిబ్బంది మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు కూడా సులభంగా ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏవైనా సమస్యలు గమనిస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఏఈ సుధాకర్ సూచించారు...

# వార్డెన్లపై చర్యల్లో రెండు రకాల నిబంధనలా?

- విజయపై వెంటనే సస్పెన్షన్... నరేందర్‌రెడ్డిపై చర్యలు ఎప్పుడు?
- ఒక వార్డెన్‌కు ఒక రూల్... మరో వార్డెన్‌కు మరో రూల్ ఎందుకు?
- వనపర్తి బీసీ బాలుర హాస్టల్ బియ్యం వ్యవహారంపై విచారణకు డిమాండ్?
- పీడీఎస్ బియ్యం వ్యవహారంలో వారం రోజులైనా చర్యలేవీ?
- పంచనామా, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించాలి?
- గోదాం, రవాణా రికార్డులపై సమగ్ర విచారణ జరపాలి?
- వార్డెన్లందరికీ ఒకే నిబంధనలు అమలు చేయాలి?
- విద్యార్థుల ఆహార భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం?
- చర్యల్లో వివక్ష ఉండకూడదు బిజీవీఎస్ శివనాయక్
- జిల్లా కలెక్టర్ స్పందించాలని బిజీవీఎస్ డిమాండ్

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 27 మీ వార్త**







వనపర్తి టౌన్ : ప్రభుత్వ హాస్టళ్లలో చోటుచేసుకునే ఘటనలపై అధికారులు ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య (బిజీవీఎస్ ) రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ శివనాయక్ డిమాండ్ చేశారు. ఒక వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకుని.. మరో వార్డెన్ విషయంలో జాప్యం చేయడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "విజయపై వెంటనే సస్పెన్షన్.. నరేందర్‌రెడ్డిపై ఇంతవరకు చర్యలు ఎందుకు లేవు?" అని ప్రశ్నించారు.

**ఒక వార్డెన్‌కు ఒక న్యాయం...మరో వార్డెన్‌కు మరో న్యాయమా...?**

గతంలో కొత్తకోట ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్ ఘటన జరిగినప్పుడు సంబంధిత వార్డెన్ విజయపై జిల్లా కలెక్టర్ వెంటనే సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని శివనాయక్ గుర్తుచేశారు. ప్రస్తుతం వనపర్తి ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్‌కు సంబంధించిన పీడీఎస్ బియ్యం వ్యవహారంలో మాత్రం సంబంధిత వార్డెన్ నరేందర్‌రెడ్డిపై ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

**పీడీఎస్ బియ్యం వ్యవహారంపై విచారణ ఏది...?**

ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చి వారం రోజులు గడుస్తున్నా సమగ్ర విచారణ లేదా తదుపరి చర్యలకు సంబంధించి అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం అనుమానాలకు తావిస్తోందని శివనాయక్ పేర్కొన్నారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.పంచనామాలో ఏముంది.వనపర్తి తహసీల్దార్ నిర్వహించిన పంచనామాలో నమోదైన అంశాలను పూర్తిగా పరిశీలించాలని ఆయన కోరారు. పంచనామా, స్టాక్ రిజిస్టర్లు, గోదాం రికార్డులు, బియ్యం రవాణా వివరాలు, ఇతర సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను తేల్చాలని డిమాండ్ చేశారు.



**విజయకు ఒక న్యాయం...నరేందర్‌రెడ్డికి మరో న్యాయమా...?**

ఒక వార్డెన్‌కు ఒక రూల్ మరో వార్డెన్‌కు మరో రూల్ అమలు చేస్తారా, విజయపై వెంటనే సస్పెన్షన్ చేసి, నరేందర్‌రెడ్డి విషయంలో మాత్రం ఎందుకు ఆలస్యం చేస్తున్నారు.అందరికీ ఒకే న్యాయం, ఒకే నిబంధనలు అమలు కావాలి అని శివనాయక్ జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు.ఆలస్యంపై అనుమానాలు,విద్యార్థులకు సంబంధించిన హాస్టల్ వ్యవహారాల్లో అధికారులు వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందని శివనాయక్ అన్నారు. ఒక ఘటనపై తక్షణ చర్యలు తీసుకుని. మరో ఘటనపై విచారణ పేరుతో జాప్యం చేయడం సరైన విధానం కాదన్నారు. బాధ్యత ఎవరిదో విచారణలో తేల్చి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

**రికార్డులన్నీ పరిశీలించాలి...?**

బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, గోదాం వివరాలు, రవాణా వివరాలను సరిపోల్చి పరిశీలించాలని బిజీవీఎస్ డిమాండ్ చేసింది. అధికారిక రికార్డుల్లో ఉన్న వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య తేడాలు ఉన్నాయా లేదా అన్నది విచారణ ద్వారా తేల్చాలని కోరింది.బిజీవీఎస్ ప్రధాన డిమాండ్లు,పీడీఎస్ బియ్యం వ్యవహారంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలి. పంచనామా వివరాలను పూర్తిగా పరిశీలించాలి.స్టాక్ రిజిస్టర్లు, గోదాం రికార్డులను తనిఖీ చేయాలి. బియ్యం రవాణా వివరాలను పరిశీలించాలి.విచారణను పారదర్శకంగా నిర్వహించాలి. విచారణలో తేలిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి.బాధ్యత తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. వార్డెన్ ల అందరికీ ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలి.విద్యార్థుల సంక్షేమం, ఆహార భద్రతపై కఠిన పర్యవేక్షణ ఉండాలని డిమాండ్.

**- చర్యల్లో వివక్ష ఉండకూడదు...**

చర్యలు తీసుకునే విషయంలో అధికారులు ఎలాంటి వివక్ష చూపకూడదు. విజయకు ఒక న్యాయం, నరేందర్‌రెడ్డికి మరో న్యాయం ఉండకూడదు. విచారణలో నిజాలు తేలిన వెంటనే బాధ్యులపై చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి" అని శివనాయక్ డిమాండ్ చేశారు.విద్యార్థుల సంక్షేమమే ప్రధానమన్న బిజీవీఎస్...ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సురక్షిత వాతావరణం, సరైన నిర్వహణ అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని బిజీవీఎస్ కోరింది. హాస్టళ్లలో స్టాక్ నిర్వహణ, ఆహార సరఫరా, రికార్డుల నిర్వహణపై క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు...

ఈ కార్యక్రమం లో బంజారా గిరిజన విద్యార్థి సమైక్య (బిజీవీఎస్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బంజారా నాయకులు మల్లేష్ నాయక్, మురళి నాయక్, ఆంగోత్ శివనాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు...

## నగరిపై గురి...

**తిరుపతి :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ) నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా కు ఈ ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత నగరి రాజకీయాల్లో పరిస్థితులు మారాయి. తెలుగుదేశం పార్టీ ( నుంచి గాలి భాను ప్రకాష్ నాయుడు ) విజయం సాధించడంతో నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడ్డాయి.అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రోజా పెద్దగా పట్టించుకోనప్పటికీ, ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆమె రాజకీయ ప్రభావానికి ఒక కొలమానంగా మారవచ్చని స్థానికంగా చర్చ సాగుతోంది. దీంతో నగరి మున్సిపాలిటీపై వైసీపీ ఎలా వ్యూహం రచిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాత్రం ఈ ఎన్నికలను తనకు వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.నగరి పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ బలాన్ని పెంచేందుకు భాను ప్రకాష్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు స్థానిక ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై హామీలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ స్థాయిలోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

## ఆగస్టు 29న పటాన్చెరు కి మాజీ మంత్రి హరీష్ రావు రాక..

**పటాన్ చేరు ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :**

- పటాన్చెరు జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా 22ఏ నిషేధిత భూమి బాధితులకు అండగా భారీ నిరసన..



22A నిషేధిత భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండకు నిరసనగా ఆగస్టు 29వ తేదీ శనివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ శాసనసభ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్నారని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో చట్టబద్ధంగా ప్రభుత్వానికి ఫీజులు చెల్లించి కొనుగోలు చేసిన వేలాది ఎకరాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లను 22ఏ పేరుతో పేరుతో నిషేధిత భూముల జాబితాలో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ చర్య మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలు తమ ఆస్తులను విక్రయించలేక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులకు అండగా నిలుస్తూ భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 22ఏ బాధితులతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రక్షాబంధన్ వేడుకలు

**పరకాల ప్రతినిధి మన మీ వార్త**



హనంకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ లో



వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాక్షబంధన్ కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో విధ్యార్థినిలు తోటి విధార్థులకు రాఖీలు కట్టడం జరిగింది ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుడికందుల శివ పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది వివేకానంద ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన యువ అడ్వకేట్ కూనమల్ల మధుసూదన్

**పరకాల ప్రతినిధి మన మీ వార్త**



కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గం 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన యువ అడ్వకేట్ కూనమల్ల మధుసూదన్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో మధుసూదన్ బీజేపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్, మాజీ ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆడేపు రమేష్, బీజేవైఎం నాయకులు అప్పాని సాగర్, రవి వర్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి: టీజీఈజేఏసీ

**మన మీ వార్త న్యూస్ : ఆగష్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**




ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని టీజీఈజేఏసీ జిల్లా ఛైర్మన్?, టీఎన్జీవోస్? జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్? కుమార్? పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని (నిజామాబాద్ ) ధర్నాచౌక్?లో భారీ ఎత్తున తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్? పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

**ఈహెచ్ఎస్ అమలులో నిర్లక్ష్యమెందుకు..**

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎహెచ్ ఎస్ ) అమలులో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని సుమన్? ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలి 2వ పే రివిజన్ కమిటీ నివేదిక అమలు, ఆరు పెండింగ్ డీఏల విడుదల, సీ పి ఎస్ రద్దు చేసి ఓపీఎస్? అమలు, ఈహెచ్?ఎస్?ను పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్? చేశారు. ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు, ఆరోగ్య కార్డుల వినియోగం, చికిత్స అందుబాటు, ఎంపానెల్ చేసిన ఆస్పత్రుల్లో సేవలు, వైద్య బిల్లుల పరిష్కారం తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**రెండో పీఆర్?సీ అమలు చేయాలి..**

గత మూడేళ్లుగా ఎదురుచూస్తున్న 2వ పే రివిజన్ కమిటీ నివేదికను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. జూన్ 2 లోపు పీఆర్?సీ నివేదికను కమిటీ నుండి తెప్పించుకొంటామనే సీఎం ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, కుటుంబ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు తగిన వేతన సవరణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ధర్నాలో తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్? పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు సమస్య చెప్పగానే స్పందన

- గుంతలు,ప్యాచ్‌లతో అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు
- దెబ్బతిన్న భాగాన్ని తొలగించి... చదును చేసి...కొత్తగా సీసీ రోడ్డు
- కౌన్సిలర్ పలుస శ్రీకర్‌గౌడ్ చొరవతో సమస్యకు పరిష్కారం
- వార్డు ప్రజల ఇబ్బందులు తెలుసుకుని తక్షణ చర్యలు
- కౌన్సిలర్ చొరవపై స్థానికుల అభినందనలు

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 27 మీ వార్త



వనపర్తి టౌన్ : 23వ వార్డులో రోడ్డు సమస్యపై స్థానికులు ఇచ్చిన సమాచారానికి కౌన్సిలర్ పలుస శ్రీకర్‌గౌడ్ వెంటనే స్పందించారు. ఎంట్ల శ్రీను ఇంటివైపు వెళ్లే లైన్ రోడ్డు మధ్యలో గుంతలు, ప్యాచ్‌లతో పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టారు.దెబ్బతిన్న భాగానికి



కొత్త రూపం,రోడ్డు మధ్యలో కొంత దూరం పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంతాన్ని తొలగించి, అవసరమైన విధంగా చదును చేశారు. అనంతరం దెబ్బతిన్న మేరకు మళ్లీ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిన మార్గం తిరిగి వినియోగంలోకి వచ్చింది. సమస్యను చెప్పగానే స్పందించి పనులు చేపట్టడంపై వార్డు ప్రజలు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**జమ్ములమ్మ గుడి వెనుక రోడ్డుపైనా దృష్టి...**



ప్యాచ్‌లతో ఇబ్బందులు పరిష్కరించాలని అధికారులకు సూచన 23వ వార్డులోని జమ్ములమ్మ గుడి వెనుక రోడ్డుపై ఏర్పడిన ప్యాచ్‌ల సమస్యను కూడా కౌన్సిలర్ పలుస శ్రీకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు దెబ్బతినడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజా సమస్యలపై తక్షణ స్పందన,మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి, వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న కౌన్సిలర్ శ్రీకర్‌గౌడ్‌ను స్థానికులు అభినందించారు. రోడ్లు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలపై అధికారులు కూడా స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్కాచెల్లెళ్లకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు...**

సోదర సోదరీమణుల అనుబంధం మరింత బలపడాలి కౌన్సిలర్ శ్రీకర్‌గౌడ్ ఈ సందర్భంగా 23వ వార్డు ప్రజలతో పాటు వనపర్తి జిల్లా ప్రజలకు, అక్కాచెల్లెళ్లకు, తోబుట్టువులకు, ఆడపడుచులందరికీ కౌన్సిలర్ పలుస శ్రీకర్‌గౌడ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు...

## హుజురాబాద్ మున్సిపల్ డంపింగ్ యార్డ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి ఆగష్టు 27



హుజురాబాద్ మండలం సిర్సపల్లి సమీపంలో జాతీయ రహదారి 563ని ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ ను జిల్లా కలెక్టర్ చిత్రా మిత్రా గురువారం రాత్రి పరిశీలించారు.జాతీయ రహదారిని ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉండడం పట్ల భారత జాతీయ రహదారుల ప్రాధికారత సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా రెవిన్యూ, మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో కొంత దూరం వరకు చెత్త డంప్ చేయడం నిలిపివేయాలని అన్నారు. ఇదే స్థలంలో రహదారికి కొంత దూరం తర్వాత డంప్ చేయాలని సూచించారు. రహదారిని అనుకున్న స్థలంలో పచ్చదనం పెంపొందించాలని, మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు.రెవిన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చెత్త సేకరించే వాహనాలు జాతీయ రహదారి నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల నుండి ఈ స్థలంలోకి వచ్చి డంప్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని అన్నారు. జాతీయ రహదారి నుండి చెత్త సేకరణ వాహనాలు వెళ్లకుండా చూడాలని, హుజురాబాద్ పట్టణంలోని డివిజన్ల వారీగా సేకరించిన చెత్త డంప్ యార్డులో వేసేందుకు వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రహదారిని ఆనుకొని చెత్త వేయకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, ఎన్.హెచ్.ఏ.ఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, తహసిల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం: ప్రయాణికులపైకి దూసుకెళ్లిన బెంగళూరు బస్సు.. మంది మృతి

**చిలకలూరిపేట :** పట్టణంలోని అవుట్రోడ్డు సెంటర్లో గురువారం తెల్లవారుజామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోటప్పకొండ నుండి వేలూరు గ్రామానికి బయలుదేరిన ప్రయాణికులను బెంగళూరు వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఘటనా స్థలిలోనే సుమారు 4 నుంచి 6మంది దుర్మరణం చెందినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు ప్రయాణికులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రారంభానికి ముందే కుంగిన బ్రిడ్జి రోడ్డు

- నాణ్యతా ప్రమాణాలు గాలికి... పెద్ద రంధ్రంతో ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు
- అధికారుల పర్యవేక్షణ ఏది... కాంట్రాక్టర్ పనితీరుపై అనుమానాలు
- భారీ వాహనం చిక్కుకుంటే అంతే...ప్రమాదం పొంచి ఉందంటున్న స్థానికులు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగష్టు 27 మీ వార్త

రేవల్లి: నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం మరోసారి వెలుగుచూసింది. రేవల్లి--నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువపై ఇటీవల నిర్మించిన బ్రిడ్జి సీసీ రోడ్డు ప్రారంభానికి ముందే కుంగిపోయింది. రోడ్డుపై పెద్ద రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది.కొత్తగా నిర్మించిన రోడ్డు ప్రారంభానికి ముందే ఇలా దెబ్బతినడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే రోడ్డు కుంగిపోయిందని మాజీ జడ్పీటీసీ భీమయ్య, మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి ఆరోపించారు.ఈ మార్గం మీదుగా నిత్యం పొలం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం రోడ్డుపై ఏర్పడిన భారీ రంధ్రం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రివేళల్లో రంధ్రం కనిపించకపోతే వాహనాలు అదుపుతప్పే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భారీ వాహనం రంధ్రంలో చిక్కుకుంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. కొత్తగా నిర్మించిన రోడ్డు ఇంత త్వరగా కుంగిపోవడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు. నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్, పనుల నాణ్యత, రోడ్డు నిర్మాణ సమయంలో చేపట్టిన పర్యవేక్షణపై అధికారులు సమగ్రంగా విచారణ



చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.తక్షణమే మరమ్మతులు చేపట్టాలి,అధికారులు వెంటనే బ్రిడ్జి రోడ్డును పరిశీలించి, కుంగిపోయిన ప్రాంతంలో నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా రాకపోకలకు తగిన ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు...

# రక్షాబంధన్ వేడుకల్లో అమృత ప్రాజెక్ట్స్ ఆత్మీయ సందడి

- సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్
- ప్రేమానురాగాలతో రాఖీ పౌర్ణమి వేడుకలు
- అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన అమర్ జీవ్ రెడ్డి
- సంస్థ ప్రతినిధులు, ఇన్వెస్టర్లు, ఛానెల్ పార్టనర్స్, కస్టమర్లతో ఘనంగా వేడుకలు
- నమ్మకం...పారదర్శకత...నిబద్ధతే సంస్థ విజయానికి పునాది
- సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై. అమర్ జీవ్ రెడ్డి

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగష్టు 27 మీ వార్త

హైదరాబాద్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా రియల్ ఎస్టేట్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న అమృత ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై. అమర్ జీవ్ రెడ్డి సోదర సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.గండిపేటలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంతో పాటు మియాపూర్ బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో సంస్థ ప్రతినిధులు, ఇన్వెస్టర్లు, ఛానెల్ పార్టనర్స్,



కస్టమర్లు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. పరస్పరం రాఖీలు కట్టుకుని, స్వీట్లు పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**బంధాలకు మరింత బలం చేకూర్చే పండుగ....**

ఈ సందర్భంగా అమర్ జీవ్ రెడ్డి మాట్లాడుతూ... రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబాల్లోనే కాకుండా సమాజంలోనూ సోదరభావం, మానవీయ విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.

**బిల్డింగ్ రిలేషన్‌షిప్స్ బియాండ్ ప్రాపర్టీస్...**

రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కేవలం ఆస్తుల కొనుగోలు, విక్రయాలకు పరిమితం చేయకుండా కస్టమర్లతో దీర్ఘకాలిక నమ్మకమైన సంబంధాలను నిర్మించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. నమ్మకం, పారదర్శకత, నిబద్ధతకు ప్రాధాన్యం ఇస్తూ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.సంస్థ అందిస్తున్న సేవల్లో రెసిడెన్షియల్ ప్రాపర్టీస్, కమర్షియల్ స్పేసెస్, ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్, ప్రాపర్టీ కన్సల్టెన్సీ, కస్టమర్ సంతృప్తి ప్రధానంగా ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**కస్టమర్ నమ్మకమే బలం...**

రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకమే కీలకమని, కస్టమర్లకు పారదర్శకమైన సమాచారం అందిస్తూ వారి పెట్టుబడులకు తగిన మార్గదర్శకత్వం ఇవ్వడమే సంస్థ ధ్యేయమని పేర్కొన్నారు. కస్టమర్ సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని సంస్థ ముందుకు సాగుతోందని తెలిపారు.

**ఆప్యాయతల మధ్య రాఖీ పండుగ...**

సంస్థ కార్యాలయాల్లో జరిగిన వేడుకలు సోదరభావం, ఆప్యాయతలతో సందడిగా సాగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం వెల్లివిరియాలని, సోదర సోదరీమణుల బంధం మరింత బలపడాలని శ్రీ వై. అమర్ జీవ్ రెడ్డి ఆకాంక్షించారు...

# ఆస్తుల ముందు చిన్నబోతున్న అనుబంధాలు

- ఆప్యాయతల బంధాన్ని కాపాడుకోవాల్సిన అవసరం

ప్రత్యేక కథనం

భారతీయ సంస్కృతిలో సోదర--సోదరీమణుల మధ్య ఉండే అపురూపమైన అనురాగానికి ప్రతీక రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, వారి మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణ అనే బంధాన్ని గుర్తుచేసుకుంటుంది. 'రక్ష' అంటే కాపాడటం, 'బంధన్' అంటే బంధం. అయితే కాలం మారుతున్న కొద్దీ ఈ పవిత్రమైన బంధాల రూపురేఖలు కూడా మారుతున్నాయనే ఆందోళన సమాజంలో వ్యక్తమవుతోంది. రాఖీ కేవలం చేతికి కట్టే నూలుదారం కాదు. కష్టసుఖాల్లో తోడుగా నిలవడం, పరస్పరం గౌరవించుకోవడం, అవసరంలో ఆదుకోవడం అనే విలువలకు ప్రతీక. రక్తసంబంధీకులకే పరిమితం కాకుండా మానవత్వం, సోదరభావాన్ని చాటిచెప్పే పండుగగా రక్షాబంధన్‌కు ప్రత్యేకత ఉంది.

**ఆస్తుల పంపకాల్లో తెగిపోతున్న బంధాలు**

ఒకే ఇంట్లో పెరిగిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఆస్తుల పంపకాల సమయంలో విభేదాలకు దిగుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. పిత్రార్జిత ఆస్తి, భూముల పంపకాలు, కుటుంబ ఆర్థిక వ్యవహారాలు రక్తసంబంధాల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. చిన్ననాటి అనుబంధాలను మరిచి కోర్టులు, పోలీస్‌స్టేషన్ల వరకు వెళ్లే పరిస్థితులు కుటుంబ వ్యవస్థకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్తి కంటే అనుబంధం గొప్పదనే భావన తగ్గిపోతుండటం, 'నా కుటుంబం--నా ప్రయోజనం' అనే సంకుచిత ఆలోచనలు పెరగడం కుటుంబాల్లో విభేదాలకు కారణమవుతున్నాయని సామాజిక పరిశీలకులు పేర్కొంటున్నారు. సొంత తోడబుట్టినవారి అభివృద్ధిని కూడా ఓర్వలేని ఈర్ష్య, పోటీ భావన కొన్నిచోట్ల సంబంధాలను శాశ్వతంగా దెబ్బతీస్తోంది.



సిడం. మోతిరాం ట్రైబల్ జర్నలిస్ట్ కాసిపేట

**పెరుగుతున్న భౌతిక దూరం.. తగ్గుతున్న అనుబంధం**

ఉద్యోగాలు, ఉపాధి, విద్య, ఆర్థిక అవసరాల కోసం కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం నేటి కాలంలో సాధారణమైంది. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు పెరుగుతున్నాయి. భౌతికంగా ఏర్పడిన దూరం క్రమంగా మానసిక దూరంగా మారుతోంది.ఒకప్పుడు రోజూ కలుసుకుని కష్టసుఖాలు పంచుకున్న తోడబుట్టినవారు ఇప్పుడు పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కలుసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. సంభాషణ తగ్గిపోవడం, పరస్పర సమస్యలను తెలుసుకునే అవకాశం లేకపోవడం కూడా బంధాల మధ్య అంతరాన్ని పెంచుతోంది.

**తల్లిదండ్రుల బాధ్యతలోనూ విభేదాలు**

ఆస్తుల పంపకాల విషయంలో పోటీ పడే కొందరు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత విషయంలో మాత్రం వెనుకంజ వేస్తున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి. బాధ్యతలను ఒకరిపై ఒకరు నెట్టివేయడం కుటుంబాల్లో వివాదాలకు దారితీస్తోంది. తల్లిదండ్రుల సేవను బాధ్యతగా కాకుండా భారంగా భావించే ధోరణి మారాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రాఖీ కట్టడం కాదు.. బంధాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యం**

సంవత్సరానికి ఒక్కరోజు రాఖీ కట్టి శుభాకాంక్షలు చెప్పడం కంటే, ఏడాది పొడవునా పరస్పర గౌరవం, ప్రేమ, సహకారంతో ఉండటమే ఈ పండుగ అసలైన సందేశం. ఆస్తులు, డబ్బు, వ్యక్తిగత విభేదాల కంటే రక్తసంబంధాలకు విలువ ఇవ్వాల్సిన అవసరం ఉంది. సోదరుడు--సోదరి మధ్య మాత్రమే కాకుండా కుటుంబంలోని ప్రతి సంబంధంలోనూ నమ్మకం, ప్రేమ, పరస్పర సహకారం అవసరం. చిన్న అపార్థాలను పెద్ద వివాదాలుగా మార్చకుండా మాట్లాడుకుని పరిష్కరించుకోవడం ద్వారా అనేక కుటుంబాలు విడిపోకుండా కాపాడుకోవచ్చు.

డబ్బును సంపాదించుకోవచ్చు.. ఆస్తులను కూడబెట్టుకోవచ్చు.. కానీ సొంత తోడబుట్టినవారిని మళ్లీ సంపాదించుకోలేమనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి. రక్షాబంధన్ సందర్భంగా ప్రతి కుటుంబం ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పంతాలు, స్వార్థాలు, ఆస్తి వివాదాలను పక్కనపెట్టి చిన్ననాటి ఆప్యాయతలను మళ్లీ గుర్తు చేసుకోవాలి. రాఖీ కేవలం చేతికి కట్టే దారం కాకుండా, మనసులను కలిపే బంధంగా నిలవాలి.

మారుతున్న కాలంలో బంధాలను కాపాడుకోవడం.. కనుమరుగవుతున్న మానవీయ విలువలను తిరిగి చిగురింపజేయడమే రక్షాబంధన్‌కు మనం ఇచ్చే నిజమైన గౌరవం.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి రూ.10,000 ఆర్థిక సహాయం చేసిన నల్ల వినయ్ రెడ్డి

లక్ష్మణ్ చందా, ఆగష్టు 27 (మన మీ వార్త న్యూస్ )



లక్ష్మణ్ చందా మండలంలో గల వడ్యాల్ వాసి నల్ల వినయ్ రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. నిర్మల్ పట్టణంలోని చింతకుంటవాడ చెందిన ఓస మధు, ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న నల్లా వినయ్ రెడ్డి వెంటనే ఆసుపత్రికి వెళ్లి మధును పరామర్శించారు .

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి అండగా నిలుస్తూ ?10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడం ఇదే నల్లా వినయ్ రెడ్డి సేవా మార్గం అని,

ప్రజల కష్టాల్లో తోడుగా,

ప్రజల కోసం నిరంతరం ముందు వుంటానని నల్ల వినయ్ రెడ్డి తెలిపారు.



మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# సరస్వతి విద్యా మందిర్ లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

**మన మీ వార్త ఆగష్టు 27 స్టేట్ కో ఆర్డినేటర్ హైదరాబాదు**

జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ భీమారం మండల మన్నె గూడెంలో గల శ్రీ సరస్వతి విద్యా మందిర్ లో ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రక్షాబంధన్ పండుగ వేడుకలను అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి, అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, ప్రేమకు, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ విశిష్టతను పిల్లలకు స్కూల్ యాజమాన్యం తెలియజేశారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి పరంధామ్ మాట్లాడుతూ రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని సోదర సోదరీమణులు మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం నమ్మకం, బాధ్యత, పరస్పర రక్షణకు ప్రతీక అని చిన్ననాటి నుంచే పిల్లల్లో సోదర భావం, ఐక్యత, మానవతా విలువలను పెంపొందించడం ఎంతో అవసరమని ఇలాంటి



పండుగల ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు పాఠశాల కరస్పాండెంట్లు తోగిటి జగదీశ్వర్, చిలువేరి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు పండుగల విశిష్టతను తెలుసుకోవడంతో పాటు వాటి వెనుక ఉన్న విలువలను ఆచరణలో పెట్టాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ప్రేమ, సోదర భావం, ఐక్యత పెంపొందించేందుకు ఇలాంటి



కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయురాలు దాసరి రేఖ,రాజ్యలక్ష్మి, రాణి, లక్ష్మి, సునీత, శిరీష, వసంత చందన సుస్మిత లతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైస్ మిల్లులపై ఉక్కుపాదం







- అనుమతులు లేకుండా నడిపితే చర్యలు తప్పవు
- భవన అనుమతులు లేవు... బోర్‌వెల్ అనుమతుల్లో ఉల్లంఘనలు
- రెండు రైస్ మిల్లులపై అధికారుల కొరడా
- ఒక మిల్లులో కూల్చివేత...మరో మిల్లులో బోర్‌వెల్ సీజ్
- రూ.17.25 కోట్లకు పైగా బకాయిలు
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి అక్రమాలు
- రైస్ మిల్లుల తనిఖీలు, కూల్చివేతల్లో ఎస్సై జలంధర్‌రెడ్డి
- సిబ్బందితో కలిసి బందోబస్తు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 27 మీ వార్త**

కొత్తకోట : నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న రైస్ మిల్లులపై అధికారులు కొరడా ఝుళిపించారు. వనపర్తి జిల్లాలోని కొత్తకోట, పెద్దమందడి మండలాల్లో రైస్ మిల్లులపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పలు ఉల్లంఘనలు గుర్తించారు. భవన నిర్మాణ అనుమతులు, నాలా (నాలా ) అనుమతులు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, బోర్‌వెల్ అనుమతులు, ఆస్తిపన్ను బకాయిలు, ఫ్యాక్టరీస్, విద్యుత్ శాఖకు సంబంధించిన అనుమతులను అధికారులు పరిశీలించారు.

**అనుమతులు ఏవీ...?**

తనిఖీల అనంతరం చాముండి రైస్‌మిల్, సాంబశివ రైస్‌మిల్‌లో భవన నిర్మాణ అనుమతులు పొందకపోవడంతో పాటు బోర్‌వెల్ అనుమతులకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ముందస్తుగా నోటీసులు, ఉత్తర్వులు జారీ చేసి అవసరమైన అనుమతి పత్రాలు సమర్పించాలని సూచించినప్పటికీ స్పందన లేకపోవడంతో గురువారం చట్టపరమైన చర్యలు చేపట్టారు.

**చాముండి రైస్ మిల్లుపై కూల్చివేత...మోజెర్లలో**



**అధికారుల చర్యలు...**

పెద్దమందడి మండలం మోజెర్లలోని చాముండి రైస్ మిల్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. నోటీసులు, ఉత్తర్వులు అందజేసిన అనంతరం కూడా అనుమతులకు సంబంధించిన పత్రాలు సమర్పించకపోవడంతో మిల్లు నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత బకాయిలు రూ.13,33,11,523గా పేర్కొన్నారు.



**సాంబశివ రైస్ మిల్లులో బోర్‌వెల్ సీజ్...విలియంకొండలో మరో మిల్లుపై చర్యలు...**

కొత్తకోట మండలం విలియంకొండలోని సాంబశివ రైస్ మిల్లుపై కూడా అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులు లేకపోవడంతో కూల్చివేత చర్యలు చేపట్టడంతో పాటు అనుమతి లేని బోర్‌వెల్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ మిల్లుకు సంబంధించిన డిఫాల్ట్ బకాయి మొత్తం రూ.3,92,17,269గా అధికారులు పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన రైస్ మిల్లులపై అధికారులు చేపట్టిన చట్టపరమైన చర్యల్లో పోలీసులు కూడా భాగస్వాములయ్యారు. పెద్దమందడి మండల పరిధిలోని రైస్ మిల్లులపై అధికారులు నిర్వహించిన తనిఖీలు, తదనంతర చర్యల సందర్భంగా ఎస్సై జలంధర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.మిల్లుల వద్ద అధికారులు తమ విధులను సజావుగా నిర్వహించేలా పోలీసు సిబ్బంది భద్రత కల్పించారు. ముందస్తు నోటీసులు, ఉత్తర్వుల అనంతరం చేపట్టిన చర్యల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.

**అధికారులకు సహకారం...**

రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు చేపట్టిన చట్టపరమైన చర్యలకు పోలీసులు అవసరమైన సహకారం అందించారు. మిల్లుల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టారు. చట్ట పరమైన చర్యల్లో సమన్వయం,వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టిన ఈ చర్యల్లో పోలీసుల పాత్ర కీలకంగా నిలిచింది. ఎస్సై జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ అధికారులకు సహకరించారు. ప్రభుత్వ నిబంధనల అమలులో భాగంగా చేపట్టిన చర్యలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

**బకాయిలు చెల్లించకపోతే చర్యలే...**


అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక...ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడం, అవసరమైన అనుమతులు పొందకపోవడం, ప్రభుత్వ బకాయిలు చెల్లించకపోవడంపై ఇకపై కూడా చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. రైస్‌మిల్లుల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా అన్ని అనుమతులు పొందడంతో పాటు ప్రభుత్వ బకాయిలను సకాలంలో చెల్లించాలని సూచించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు...

# డాటా సెంటర్ల కెపాసిటీ మూడింతలు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా డాటా సెంటర్లకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది. వచ్చే నాలుగేండ్లకాలంలో డాటా సెంటర్ల కెపాసిటీ మూడింతలు పెరిగి 5 నుంచి 6 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని మార్కెట్ రీసెర్చ్ సంస్థ రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్ తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.65 గిగావాట్ల సామర్థ్యంతో డాటా సెంటర్లు నిర్వహిస్తున్నారు. డిజిటల్ వ్యక్తిగత డాటా పరిరక్షణ చట్టం సూచనమేరకు డాటాను స్థానికంగా నిల్వ చేయాల్సిన అవసరం ఉన్నదని, అలాగే రిజర్వ్‌బ్యాంక్, ఐఆర్‌డీఏఐల నుంచి ఆదేశాలు జారీ కావడంతో డాటా వినిమయం ఊపందుకున్నదని, వీటికి తోడు దేశంలో మెగావాట్‌కు సుమారు 8 మిలియన్ డాలర్ల తక్కువ ఖర్చు కావడంతో ఇక్కడ డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి దేశీయ, అంతర్జాతీయ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొన్నారు. 2025 క్యాలెండర్ ఏడాది చివరి నాటికి 1.65 మెగావాట్లుగా ఉన్న డాటా సెంటర్ల కెపాసిటీ 2030 నాటికి 5–6 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది.

## శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన..



**కర్నూలు :** శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు.దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి.బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది.ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. మొత్తంగా 37 మంది ఉద్యోగుల స్థానిక అంతర్గత బదిలీలతో శ్రీశైలం దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ మార్పుల అనంతరం దేవస్థానం రోజువారీ పరిపాలన, ఉద్యోగుల విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది..!

## జోగిని తలంటిన అధిష్టానం



**విజయవాడ :** మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కుటుంబ కలహాలను, వైవాహిక సమస్యలను నేరుగా పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ ద్వారా బయటపెట్టి, దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడంపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. వ్యక్తిగత తప్పులను లేదా కుటుంబ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోందని తాడేపల్లి వర్గాలు భావిస్తున్నాయి.వివాదం ముదిరి జోగి రమేష్ కోడలు మేఘన స్వయంగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడటంతో ఈ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. అత్తారింట్లో తనకు జరిగిన అన్యాయాన్ని, వేధింపులను వివరిస్తూనే.. న్యాయం కోసం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినా ఫలితం లేకపోయిందని, జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి కూడా అవకాశం దక్కలేదని ఆమె బహిరంగంగా వెల్లడించడం పార్టీకి మింగుడుపడటం లేదు. సమాజంలోనూ, చట్టపరంగానూ ఇలాంటి సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా బాధితురాలిగా నిలిచే మహిళల వైపే ప్రజా సానుభూతి ఎక్కువగా ఉంటుంది. పైగా, బయటపడిన వీడియోలు కొన్నే, అసలు ఆధారాలు ఇంకా చాలా ఉన్నాయి అని మేఘన హెచ్చరించడంతో ఇది పార్టీకి మరింత డ్యామేజ్ తెచ్చిపెడుతుందనే భయం వైఎస్సార్‌సీపీలో మొదలైంది.ఆరోగ్యపరమైన, వైవాహికపరమైన వైఫల్యాలు తెలిసి కూడా పెళ్లి చేసి జీవితాన్ని నాశనం చేశారనే ఆరోపణలతో పాటు, మత విశ్వాసాలు, కట్న వేధింపుల వ్యవహారాలను కూడా బయటకు లాగడం వల్ల ప్రతిపక్షాలకు మంచి రాజకీయ అస్త్రం దొరికినట్లయింది. ఓవైపు జగన్ సహా పార్టీ కీలక నేతల పేర్లను ఈ వివాదంలోకి లాగడం, మరోవైపు మతపరమైన అంశాలు ప్రజల్లోకి వెళ్లడం పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే జోగి తీరుపై జగన్ అసహనంతో ఉన్నట్లుగా చెబుతున్నారు.ఈ పరిణామాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన వైఎస్సార్‌సీపీ నాయకత్వం.. జోగి రమేష్‌ను హెచ్చరించినట్లు సమాచారం. వ్యక్తిగత లే, కుటుంబ సంక్షోభాలకు వైఎస్సార్‌సీపీకి చుట్టవద్దని న, పార్టీ పేరును ఈ వ్యవహారంలోకి లాగవద్దని తాడేపల్లి ప్యాలెస్ నుంచి కఠిన ఆదేశాలు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. లీగల్‌గానూ, వ్యక్తిగతంగానూ తేల్చుకోవాల్సిన సమస్యలను రాజకీయంగా మార్చవద్దని చెప్పినట్లుగా తెలుస్తోంది. వీలైనంత త్వరగా వివాదాన్ని ముగించుకోవాలని ఆదేశించినట్లుగా చెబుతున్నారు

## ఉత్తరాంధ్రలో రియల్ జోరు

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్ర పారిశ్రామిక కేంద్రమైన శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పైడిభీమవరం, ఎచ్చెర్ల బెల్ట్‌లో స్థిరాస్తి వ్యాపారం మళ్లీ వేగం పుంజుకుంది. జాతీయ రహదారి అనుసంధానంతో ఉన్న ఈ కారిడార్‌లో ఫార్మా రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల విస్తరణ పనులు ఊపందుకోవడంతో నివాస స్థలాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ఉద్యోగులతో పాటు స్థానిక ఇన్వెస్టర్లు ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో లేఅవుట్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.పైడిభీమవరం పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటిది కావడంతో అక్కడ పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, టెక్నీషియన్లకు శాశ్వత నివాసాలు కల్పించే దిశగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు సరికొత్త వెంచర్లను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటికి తోడు ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో పాటు పలు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కొలువై ఉండటంతో ఈ ప్రాంతం ఎడ్యుకేషనల్ అండ్ ఇండస్ట్రియల్ హబ్‌గా రూపాంతరం చెందింది. ఈ విద్యా, పారిశ్రామిక వాతావరణమే ఇక్కడ హౌసింగ్ లేఅవుట్ల విక్రయాలు పుంజుకోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.మరొకవైపు విశాఖపట్నం–భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కారిడార్ ప్రభావం శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల వరకు విస్తరించడంతో ఇక్కడ భూముల విలువలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో జాతీయ రహదారికి ఇరువైపులా విఆర్డిఎ అనుమతులు పొందిన లేఅవుట్లు పెద్ద ఎత్తున రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ధరకే ప్లాట్లు దొరకడం, భవిష్యత్తులో మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉండటంతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.ముగింపుగా చూస్తే, పైడిభీమవరం–ఎచ్చెర్ల పారిశ్రామిక కారిడార్ శ్రీకాకుళం జిల్లాలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న స్థిరాస్తి కేంద్రంగా మారుతోంది. ప్రభుత్వం కూడా ఈ కారిడార్‌లో రవాణా వసతులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ నివాస గృహాల నిర్మాణాలు మరింత ఊపందుకుంటాయని, ఇది జిల్లా ఆర్థిక పురోగతికి మరింత తోడ్పడుతుందని స్థానిక స్థిరాస్తి నిపుణులు విశ్లేషిస్తున్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512